జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ | గురువారం 9 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 150 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం సూర్యోదయం: 5:32 । సూర్యాస్తమయం: 6:33 చంద్రోదయం: 1:10 । చంద్రాస్తమయం: 1:23 తిథి: బహుళ నవమి ఉ. 5:52 వరకు, తదుపరి దశమి రా. 3:56 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం: అశ్విని ఉ. 11:18 వరకు, తదుపరి భరణి యోగం: సుకర్మ ఉ. 7:27 వరకు, తదుపరి ధృతి ఉ. 4:51 వరకు, తదుపరి శూల కరణం: గరజి ఉ. 5:52 వరకు, తదుపరి వణిజ సా. 4:54 వరకు, తదుపరి భవ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989894528




# వర్షం లేక కలవరం

## కరుణించని మేఘం.. పెట్టుబడి అదనం

## వర్షాలు లేక మొలకెత్తని విత్తనాలు

## రెండోసారి విత్తి నష్టపోతున్న రైతులు

వానాకాలం సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలను చూసి జిల్లా రైతులు విత్తనాలు వేసుకున్నారు. తర్వాత కొన్ని రోజులకే వరుణుడు ముఖం చాటేశాడు. విత్తనాలు మొలకెత్త లేదు. రైతులు విత్తనాల రూపంలో నష్టపోయారు. పంట సాగుపై ఆశ వదులుకోని రైతులు మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి విత్తుకున్నాడు. రెండోసారి కూడా అదే పరిస్థితి. బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలం పుల్కల్ గ్రామరైతు మారుతి 15రోజుల క్రితం సోయా విత్తనాలు వేశారు. వర్షాలు కురవక అవి మొలకెత్త లేదు. సోమవారం ట్రాక్టర్‌తో రెండోసారి విత్తనాలు వేశారు. ఒక్కో సోయా సంచిని రూ.4200 చొప్పున చెల్లించానని, మొలకెత్తకపోవడంతో నష్టపోయానని రైతు వాపోతున్నారు. రెండున్నర ఎకరాల్లో సోయా విత్తనాలు వేశానని, ఎకరాకు రూ.12000 చొప్పున నష్టపోయినట్లు తెలిపారు.



# గుంతలు తేలి.. అధ్వానంగా మారి..

## మూడేళ్లుగా పూర్తికాని బిచ్కుంద-బాన్సువాడ రోడ్డు పనులు


## ప్రయాణికులకు తప్పని రవాణా కష్టాలు



బిచ్కుంద

బిచ్కుంద-బాన్సువాడ రహదారి గుంతలు తేలి అధ్వానంగా మారింది. మూడేళ్ల కిందట పిట్లం మండలం బొల్లక్‌పల్లి నుంచి బిచ్కుంద మండలం కందర్‌పల్లి వరకు 25 కిలోమీటర్ల వరకు బీటీ రహదారి పనులు మొదలు పెట్టారు. బొల్లక్‌పల్లి నుంచి వాజిద్‌నగర్ వరకు 10 కిలోమీటర్లు మాత్రమే బీటీ రోడ్డు వేశారు. వాజిద్‌నగర్ నుంచి కందర్‌పల్లి వరకు 15 కిలోమీటర్ల రహదారి పనులు నిలిచిపోయాయి. బాన్సువాడ నుంచి బిచ్కుంద, మద్నూర్, జుక్కల్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ రహదారే ఆధారం. రోడ్డు గుంతలు తేలి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేక కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిని బీటీ రోడ్డుగా మార్చడానికి రూ.29.79 కోట్లు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. నిధులు అందుబాటులో ఉన్నా.. పనులు పూర్తిచేయకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మిగిలిన పనులను సత్వరమే పూర్తిచేయించాలని కోరుతున్నారు.

# సాంకేతికతతో లారీలపై నిఘా



- ఓవర్‌లోడ్ వాహనాలకు బ్రేకులు
- రవాణా శాఖ కఠిన నిబంధనలు
- ఇలాంటి వాటిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలి
- నిరంతం తనిఖీలు నిర్వహించాలి.



# కొనసాగుతున్న రెండో విడత ప్రక్రియ

## శరవేగంగా ఇందిరమ్మ ఇళ్లు

## జిల్లాలో ఇప్పటికే 6,395 నిర్మాణాలు పూర్తి

కామారెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. మొదటి విడతలో 12,090 ఇళ్లు మంజూరు కాగా.. అందులో 6,395 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాల్లో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో 6వ స్థానంలో కొనసాగుతుండగా.. డబ్బుల పంపిణీలో 8వ స్థానంలో ఉంది. ఇప్పటి వరకు ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ.241.61 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచడానికి పాలనాధికారి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ప్రతి మండలానికి వెళ్లి క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి వారం సమీక్ష నిర్వహించి అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడంతో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి పుంజుకుంది. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో సగం కంటే ఎక్కువ నిర్మాణాలు పూర్తయ్యాయి.

- మిగతా 2లో

## సాంకేతికతతో లారీలపై నిఘా

**ఆర్మూర్ :** రవాణా శాఖలో నిబంధనల ఉల్లంఘనులకు ఇకపై కాలం చెల్లింది. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాల భరతం పట్టడానికి అధికారులు కదులుతున్నారు. నిబంధనలను అత్యంత కట్టుదిట్టం చేశారు. కేవలం జరిమానాలతో సరిపెట్టే పాత పద్ధతికి స్వస్తి పలికి.. ఏకంగా అనుమతులనే రద్దు చేసేలా సాంకేతికను రంగంలోకి దించారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. జిల్లా మీదుగా నిత్యం వేలాది లారీలు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాయి.

**ప్రమాదాలు.. రోడ్లు ధ్వంసం**

అధిక బరువుతో రాకపోకలు సాగించే వాహనాల వల్ల బ్రేకులు ఫెయిల్ అవ్వడం, మలుపుల వద్ద అదుపుతప్పి బోల్తా పడటం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అదేవిధంగా కోట్లు పెట్టి వేస్తున్న రహదారులు ధ్వంసమవుతున్నాయి

**ఒకసారి పరిశీలిస్తే..**

ఆరు టైర్లు కలిగిన వాహనం 18.5 టన్నులు, 10 టైర్లు 28 టన్నులు, 12 టైర్లు 35 టన్నులు, 16 టైర్లుంటే 46.5 టన్నులు, 20 టైర్లుంటే 49 టన్నులు, 22 టైర్లుంటే 55 టన్నుల బరువుతో సరకులు తరలించాలి. అంతకు మించి ఒక్క శాతం ఎక్కువ ఉన్నా.. ఓవర్ లోడ్ కింద పరిగణిస్తారు.

**గతంలో జరిమానాలు**

గతంలో ఓవర్‌లోడ్ వాహనాలు ఎన్నిసార్లు పట్టుబడినా అధికారులు జరిమానాలు విధించి వదిలేసేవారు. గూడ్స్ వాహనాల్లో నిర్దేశిత పరిమితి కంటే 5 శాతం అదనంగా లోడ్ ఉన్నట్లు గుర్తిస్తే ప్రతి అదనపు టన్నుకు రూ.1000 చొప్పున లెక్కగట్టి జరిమానా వసూలు చేశారు.

## కొనసాగుతున్న రెండో విడత ప్రక్రియ

-మొదటిపేజీ తరువాయి

రెండో విడత లబ్ధిదారులను కూడా ఎంపిక చేస్తున్నారు. నియోజకవర్గానికి 1500 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ లెక్కన జిల్లాలో 4800 వరకు ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. గ్రామాలు, పట్టణాల్లో ఒక్క గుడిసె కూడా కనిపించవద్దని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే గుడిసెల్లో నివాసం ఉండేవారికే రెండో విడతలో ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం 1356 ఇళ్లు మంజూరయ్యాయి. ఆ తర్వాత అద్దె ఇళ్లల్లో నివసించేవారికి ప్రాధాన్యత ఇస్తారని అధికారులు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ కమిటీలు, పంచాయతీ పాలకవర్గాలు గుడిసెల్లో నివాసం ఉంటున్న వారిని ఎంపిక చేస్తున్నారు.

**గోడ గడియారాలు కానుక**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశం చేస్తున్న లబ్ధిదారులకు జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ గోడ గడియారాలను కానుకగా అందజేస్తున్నారు. ఆయా మండలాల ఎంపీడీవోల ద్వారా ఇప్పటికే 1250 మంది లబ్ధిదారులకు గడియారాలు అందాయి. మిగిలినవారికీ విడతల వారీగా అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ పంపిస్తున్న గడియారాలు అందుకుంటున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమను పాలనాధికారి గుర్తు పెట్టుకుని గడియారాలు పంపించడం సంతోషంగా ఉందని పేర్కొంటున్నారు.

# నాకు మంత్రి పదవి ఇవ్వండి
# నీళ్లు ఎలా రావో చూస్తా

హైదరాబాద్



గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీళ్లను వదులుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాళేశ్వరంలో నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకు వస్తుందన్నారు. ఇలాంటి వారిని ఉరితీసినా తప్పులేదన్నారు. నీళ్లు ఉండి కూడా వరంగల్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

మంగళవారం రేవంత్ రెడ్డి ప్రసంగం సొల్లు తప్ప, ఏదీ నిజం లేదని, అబద్ధాలకు చొక్కా తొడిగితే రేవంత్ రెడ్డిలా ఉంటుందని ఎద్దేవా చేశారు. అబద్ధాల్లో నోబెల్ ఇవ్వాల్సి ఉంటే రేవంత్‌కే ఇవ్వాలని సూచించారు.

**తుమ్మిడిహట్టి పేరిట రూ.2,328 కోట్లు తిన్నారు**

కాంగ్రెస్ ఉన్నప్పుడే తుమ్మిడిహట్టికి ఒప్పందం అయినట్లు సీఎం చెప్పారని, తుమ్మిడిహట్టికి రూ.6,500 కోట్లు ఖర్చుపెట్టినట్లు సీఎం చెబుతున్నారని, 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నాయని హరీశ్ రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టిలో తట్టెడు మట్టి ఎందుకు తీయలేదు? ప్రశ్నించారు. పనులు చేయకుండా రూ.2,328 కోట్లు తిన్నారని, మట్నబిలైజేషన్ అడ్వాన్స్‌లు పేరిట కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్లు తిన్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం రాగానే మట్నబిలైజేషన్ అడ్వాన్స్ విధానాన్ని తొలగించామని, తుమ్మిడిహట్టికి అనుమతి ఇవ్వాలని మహారాష్ట్ర ఇరిగేషన్ మంత్రిని కలిశానని అన్నారు.

కాంగ్రెస్ సీఎంలు కోరితేనే ఇవ్వలేదని, మీకు ఎలా ఇస్తామని ప్రశ్నించారని తెలిపారు. తుమ్మిడిహట్టి నిర్మాణానికి తాము అన్ని ప్రయత్నాలు చేశామని పేర్కొన్నారు. ప్రాజెక్టును కావాలని మార్చలేదని, నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయం చూసుకోవాలని కేంద్రం లేఖ రాసిందని, నీళు లేని చోట తుమ్మిడిహట్టి ప్రాజెక్టును కాంగ్రెస్ తలపెట్టిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి అసత్య మాటలు మాట్లాడటం ఇప్పటికైనా మానాలని హితువు పలికారు.

"నీటిపారుదల మంత్రిగా నాకు 3 నెలలు అవకాశం ఇవ్వండి. నీళ్లు ఎలా రావో చూస్తా. కన్నెపల్లి నుంచి ఎల్లంపల్లి వరకు నీళ్లు తెస్తా. నీళ్లు తీసుకురాలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా. ఈ మూడు నెలలపాటు జీతం, కారు, ప్యూన్, ఫ్యాన్ ఏమీ వద్దు. నాకు పదవులు ఏం కొత్త కాదు. 13 ఏళు మంత్రిగా చేశాను"

**రాజీనామా చేస్తా**

సీఎం తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర అనుమతి ఇచ్చిందని చెప్పారని, ఒకవేళ అనుమతి ఇచ్చింది నిజమే అయితే రేవంత్ రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెడితే రాజీనామా చేస్తామని సవాల్ చేశారు. తుమ్మిడిహట్టి నిర్మిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందని, కాంగ్రెస్ వచ్చి రెండున్నరేళ్లు అయినా తుమ్మిడిహట్టి కోసం ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ డీఎన్ఏలోనే అవినీతి ఉందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉండగా జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అని విమర్శించారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి పార్టీ మారగానే మాటమార్చారని వెల్లడించారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టవద్దని నిపుణులు చెప్పలేదని, మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దని నిపుణులు చెప్పినట్లు సీఎం అసత్యాలు చెబుతున్నారని విమర్శించారు. తమ నివేదికను దృష్టిలో పెట్టుకునే మేడిగడ్డ నిర్మించినట్లు నిపుణులు అఫిడవిట్ ఇచ్చారని తెలిపారు. సీఎం చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చిల్లర రాజకీయాల కోసం రైతులు, రాష్ట్ర ప్రయోజనాలు పక్కనపెట్టడం సరైనదేనా? నిలదీశారు. వ్యాప్కోస్‌ను చెఫ్‌తో పోలుస్తూ రేవంత్ రెడ్డి మాట్లాడారని, చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు కోసం వ్యాప్కోస్‌ను తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమేనని, చేవెళ్ల-ప్రాణహితకు వ్యతిరేకంగా లేఖలు వచ్చాయని, ప్రత్యామ్నాయం చూపాలని వ్యాప్కోస్‌ను కోరామని అన్నారు. నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా వ్యాప్కోస్‌కే పనులు అప్పగించిందని, రేవంత్ రెడ్డి పనులు అప్పగిస్తే కరెక్టు మేం చేస్తే తప్పా? అని ప్రశ్నించారు. "తుమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీలు లేవని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ వద్ద 240 టీఎంసీలు వాడుకోవచ్చని నివేదికలో పేర్కొంది. 160 టీఎంసీలు లేని దగ్గర ప్రాజెక్టు కట్టాలా? 240 టీఎంసీలు ఉండే దగ్గర ప్రాజెక్టు కట్టాలా?. అన్ని అనుమతులు తీసుకొనే మేడిగడ్డ బ్యారేజీ నిర్మించాం. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 16 టీఎంసీలు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 141 టీఎంసీలు. కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టు అంచనా రూ.1,400 కోట్ల నుంచి రూ.4 వేల కోట్లకు పెంచారు" - హరీశ్‌రావు, మాజీ మంత్రి

**మోటార్లు ఇప్పుడు ఆన్ చేసినా నీళ్లు వస్తాయి**

ఎస్ఎల్‌బీసీలో 8 మంది కార్మికులు చనిపోతే మృతదేహాలు కూడా తీయలేదని, రేవంత్ రెడ్డి తప్పిదం వల్ల వట్టెం పంప్‌హౌస్ కూలిపోయిందని తెలిపారు. నీళ్లు వదలకుండా నిల్వ చేసినందుకు వట్టెం పంప్‌హౌస్ కూలిపోయిందని, ఇసుక అక్రమ రవాణా కోసం పెద్దపల్లి జిల్లాలో బాంబులు పెట్టి చెక్‌డ్యామ్‌లు పేల్చారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఇన్ని కూలిపోతే కాంగ్రెస్ నేతలు ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. 2022లో గోదావరి నది చరిత్రలో ఎప్పుడూ రానంత వరద వచ్చిందని, విపరీతంగా వరద రావడం వల్ల కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిందని, కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిన 45 రోజుల్లో మరమ్మతులు చేసి మోటార్లు ఆన్ చేశామని, కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఇప్పుడు ఆన్ చేసినా నీళ్లు వస్తాయని, బదనాం చేయడానికే ఉత్తమ్ మాట్లాడుతున్నారు తప్ప వాస్తవం లేదని వివరించారు.

**నీటిని వృథా చేస్తారా?**

కాంగ్రెస్ సర్కార్‌ను 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. మేడిగడ్డ వద్ద వృథాగా లక్షల క్యూసెక్కులు పోతున్నాయని, నీళ్లు లేక పల్లెల్లో రైతన్నలు కన్నీళ్లు పెడుతున్నారని అన్నారు. నీళ్లు లేక రైతులు కన్నీళ్లు పెడుతుంటే నీటిని వృథా చేస్తారా? అని నిలదీశారు. నిర్లక్ష్యం వహించి కాంగ్రెస్ సర్కార్ తమాషా చూస్తోందని మండిపడ్డారు.

# 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం

2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం దక్కడం పట్ల రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, యువ క్రీడాకారులకు ప్రోత్సాహం, క్రీడల విస్తరణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగానే తెలంగాణకు ఈ ప్రతిష్ఠాత్మక ఆతిథ్య అవకాశం లభించిందన్నారు. 2026 ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణను ఆతిథ్య రాష్ట్రంగా ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుక్ మాండవియాలకు మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ద్వారా దేశవ్యాప్తంగా వేలాది మంది యువ క్రీడాకారులు తెలంగాణకు రానున్నారని, రాష్ట్ర ఆతిథ్య సామర్థ్యాన్ని దేశానికి చాటిచెప్పే అవకాశం ఇదని మంత్రి పేర్కొన్నారు. సీఎం రేవంత్ మార్గదర్శకత్వంలో అన్ని శాఖల సమన్వయంతో ఈ క్రీడా మహోత్సవాన్ని అత్యంత




విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల నిర్వహణ తెలంగాణలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి, భావితర క్రీడాకారులకు ప్రేరణగా నిలవడానికి దోహదపడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు.

## వికలాంగులకు వీల్ చైర్ పంపిణీ చేసిన పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్



**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి జూలై8** నిజామాబాద్ జిల్లా భీమ్గల్ మండల్ మెండోరా గ్రామంలో పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి సిహెచ్ డానియల్ ఆధ్వర్యంలో అవసరమైన వారికి వీల్ చైర్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శారీరక ఇబ్బందులతో బాధపడుతున్న వారికి సహాయంగా20వీల్ చైర్లు అందజేశారు. ఈ సందర్భంగా సిహెచ్ డానియల్ మాట్లాడుతూ, సమాజంలో ఉన్న పేద, అంగవైకల్యం కలిగిన నిరుపేద కుటుంబాలకు సహాయం అందిస్తూ బలహీన వర్గాలకు సహాయం చేయడం సంస్థ లక్ష్యమని తెలిపారు ఉచిత పంపిణీ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు గ్రామాలు తాండాలు పల్లె గ్రామాల్లో అవసరమైన నిరుపేద కుటుంబాలకు సహాయమందించడమే సమస్త లక్ష్యం అని వారన్నారు . ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, అవసరమైన వారికి సహాయం అందించడం ఎంతో సంతోషకరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ అశోక్ మనోహర్ ఆశ వర్కర్ మార్త వీరి చేతుల మీదుగా తీసుకున్న వ్యక్తుల వివరాలు గుడ్ల బాత్ గంగు సప్పల రమేష్ పందిరి గంగు రెక్క ఆసీస్ మేష తిరుమల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లాల్సిందే : ఎమ్మెల్యే వేముల ఆదేశం



**వేల్పూర్:** బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి,శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తన స్వగ్రామమైన వేల్పూర్‌లో తహసీల్దార్ సమక్షంలో బూత్ లెవల్ అధికారులకు( దీూం ) తన వ్యక్తిగత ఓటరు వివరాలను ఆయన స్వయంగా అందజేశారు. ఒక ఫారాన్ని అధికారులకు సమర్పించి, రసీదుగా మరో ఫారాన్ని తన వద్ద ఉంచుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ూ×=) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులకు, బీఎల్‌వో, బీఎల్‌ఏలకు కీలక సూచనలు చేశారు. బీఎల్‌ఓలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, గుడులు , సంఘం భవనాల్లో ఒకే దగ్గర కూర్చుని వివరాలు రాయడం సరికాదన్నారు. ఇంటింటికీ స్వయంగా వెళ్లి ఓటర్లను కలిసి వివరాలు సేకరించాలని తెలిపారు. బీఎల్‌ఓలు ఒకే దగ్గర కూర్చుని పనిచేస్తే ప్రజల ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని, ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి, ఓటర్లను ప్రత్యక్షంగా చూసి వివరాలు సేకరించిన తర్వాతే ఆఫీసులో ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ తహసీల్దార్ అనిరుద్ , సర్పంచ్ అశోక్, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య




**కామారెడ్డి :** జిల్లాలోని బాన్సువాడ ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య కలకలం రేపుతుంది. హాస్టల్ గదిలో ఇంటర్ విద్యార్థిని అమృత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మద్నూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అమృత హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. జ్వరం ఉందని కాలేజీకి వెళ్లకుండా ఉదయం హాస్టల్‌లోనే ఉండిపోయింది. మధ్యాహ్నం వచ్చిన తోటి విద్యార్థినిలు అమృత ఆత్మహత్య విషయాన్ని హాస్టల్ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో వారు పోలీసులకు, విద్యార్థిని కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు హాస్టల్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వైఫల్యం

53 లక్షల మెట్రిక్ టన్నుల కొనగోలుకు కేంద్రం అంగీకారం తెలిపినా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వైఫల్యం చెందిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు గోస ఉద్యమం తరువాతనే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలును వేగవంతం చేసిందన్నారు. రైస్ మిల్లులలో మిల్లింగ్ వేగవంతం చేసి ఫీజ× కి బియ్యాన్ని పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైనే ఉందని తెలిపారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో ,మిల్లింగ్ విషయంలో పక్కా వ్యవస్థతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలి.ఖరీఫ్ 2024-25 36 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు అంగీకరిస్తే ఈరోజు వరకు 13-14 శాతం బియ్యం పంపలేదు.

# విద్యార్థుల కష్టానికి విలువే లేదు



కేంద్ర ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యూజీసీ- నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలపై కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడ్డ దానికి ఫలితం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా కేంద్రం కళ్లు మూసుకుని హాయిగా నిద్రపోతోందని మండిపడ్డారు. 2026 జూన్?లో ఎన్?టీఏ నిర్వహించిన యూజీసీ- నెట్? పరీక్షపై హరియాణాలోని రోహ్తక్‌లో విద్యార్థి నాయకులు తీవ్రమైన ఆరోపణలు చేశారని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన పంచుకున్నారు.

గత వారం జరిగిన యూజీసీ- నెట్ పరీక్షకు సంబంధించి వెలుగులోకి వచ్చిన తీవ్రమైన ఆరోపణలు పూర్తిగా విచారం కలిగిస్తున్నాయని రాహుల్? ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ అయిన కొద్ది వారాలకే, యూజీసీ- నెట్? పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్? కాపీ ఒకటి పంపిణీ జరిగినట్లు, అందులో దాదాపు 90 ప్రశ్నలు అసలైన ప్రశ్నాపత్రంతో సరిపోలుతున్నాయని కథనాలు వచ్చినట్లు ఆరోపించారు. కేవలం ఎన్?టీఏ వద్ద మాత్రమే అందుబాటులో ఉండే ఈ పీడీఎఫ్? ప్రశ్నాపత్రం బయటకు రావడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

"రాజస్థాన్, ఢిల్లీ, హరియాణా, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ ప్రశ్నాపత్రం రూ. 2.25లక్షలకు విక్రయించారు. అలాగే, సీఎస్?ఐఆర్?- నెట్?, హెచ్?టీఈటీ, ఏడీఏ వంటి రానున్న పరీక్షలకు కూడా ప్రశ్నాపత్రాలు అందుబాటులో ఉన్నట్లు ఆ ముఠా? పేర్కొంది. నీట్?, నెట్? పరీక్షల్లో వరుసగా కుంభకోణాలు జరుగుతున్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ విషయంపై, మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి జవాబుదారీతనాన్ని లేదా తక్షణ చర్యను ఆశించడం వ్యర్థమని దేశం మొత్తానికి తెలుసు."

పరీక్షల అవకతవకల్లో మార్పు రావాలంటే కలిసికట్టుగా గొంతుకను వినిపించడమే ఏకైక మార్గమని రాహుల్? స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా వినిపించే విద్యార్థుల గర్జన, దేశంలో విద్యా విప్లవాన్ని తీసుకువస్తుందని ఆయన నొక్కి చెప్పారు. కాగా, ఈ ఆరోపణలపై ఎన్?టీఏ నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

**ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి : జైరాం రమేశ్**

ఇదిలా ఉండగా, అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీ విషయంలో ఆలయ ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ బుధవారం డిమాండ్ చేసింది. అలాగే, ట్రస్ట్ సభ్యుల ఎంపికలో జరిగిన తప్పునకు గాను ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరింది. రామమందిర నిర్మాణ ఘనతను తమ ఖాతాలో వేసుకోవడంలో ముందున్న ప్రధాని, విరాళాల చోరీ బాధ్యతను స్వీకరించడానికి ఎందుకు వెనుకాడుతున్నారని కాంగ్రెస్ సీనియర్? నేత జైరాం రమేశ్? ప్రశ్నించారు. "ట్రస్ట్‌ను రద్దు చేసి, కొత్త ట్రస్ట్‌ను ఏర్పాటు చేయండి. అసలైన దోషులను అరెస్టు చేయండి. ఈ కేసును సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపండి. మోదీ మౌనాన్ని వీడండి" అంటూ రమేష్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మరోవైపు, విరాళాల నిధులను ప్రజలకు అందుబాటులో ఉంచడంలో ట్రస్ట్ విఫలమైందని కాంగ్రెస్? పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ శక్తిసిన్హ్ గోహిల్ ఆరోపించారు. ఈ వ్యవహారం బయటపడకముందు రామాలయ రోజువారీ వసూళ్లు రూ.16 నుంచి 18 లక్షలుగా ఉండేదని, అయితే ఈ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చాక, రోజువారీ వసూళ్లు ఒక్కసారిగా రూ.24 నుంచి 26 లక్షలకు పెరిగాయని ఆయన ఆరోపించారు. దీనిని బట్టి చూస్తే అంతకుముందు రోజుకు దాదాపు రూ.10 లక్షల చొప్పున విరాళాల డబ్బు పక్కదారి పట్టిందనే అనుమానాలు రేకెత్తుతున్నాయని ఆయన తెలిపారు. రామమందిరం కోట్లాది మంది ప్రజల విశ్వాసానికి కేంద్రబిందువు అని, దానికి సంబంధించిన ఏవైనా ఆర్థిక అక్రమాలను సహించేది లేదని గోహిల్? నొక్కి చెప్పారు.

# తప్పులు సవరించుకున్న ఎన్‌సీఈఆర్‌టీ




**న్యూఢిల్లీ:** న్యాయవ్యవస్థపై ఆరోపణలతో వివాదాలకెక్కిన జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎట్టకేలకు తన తప్పులను దిద్దుకుంది. తాజాగా విడు దల చేసిన ఎనిమిదవ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో వివాదాస్పద భాగాలను తొలగించింది. కాకపోతే కొత్త పుస్తకంలోనూ కొన్ని సవరణలు చేసింది. దేశ విభజన విషయంలో కాంగ్రెస్ వైఖరిని వక్రీకరించింది. వీర్ సావర్కర్ స్వరాజ్ కోసం డిమాండ్ చేశాడన్న విషయాన్ని జోడించింది. జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్, నాజీ సిద్ధాంతాల ప్రస్తావనను తొలగించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్‌సీఈఆర్‌టీ "ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్'పేరుతో విడుదల చేసిన పాఠ్యపుస్తకంపై పెద్ద ఎత్తున దుమారం రేగిన విషయం తెలిసిందే. ఇందులోని ఒక అధ్యాయనంలో న్యాయవ్యవస్థలో అవినీతి, పెండింగ్ కేసుల ప్రస్తావనలు ఉండటం వివాదాస్పదమైంది. సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని పుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. ఏ రకంగానూ ఈ వివాదాస్పద పుస్తకం మళ్లీ ముద్రించకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌సీఈఆర్‌టీ కూడా సుప్రీంకోర్టును క్షమాపణలు కోరింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే ఆ పాఠ్యపుస్తకాన్ని సమీక్షించింది. సవరణలతో కూడిన పుస్తకం ఇటీవలే అందుబాటులోకి వచ్చింది.

**చేసిన మార్పులేమిటి?**

స్వాతంత్రోద్యమం, దేశ విభజనకు సంబంధించి ఈ పుస్తకంలో 'ఇండియాస్ లాంగ్‌రోడ్ టు ఇండిపెండెన్స్'పేరుతో ఒక అధ్యాయం ఉంది. అందులో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కూడా దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించినట్లుగా రాశారు. అలాగే స్వాతంత్ర్యం సంపాదించేందుకు దేశ విభజన ఒక్కటే మార్గమన్న విధానాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకోవడం చర్చనీయాంశమని కూడా ఉంది. విభజన సమయంలో భారత ఉపఖండంలో మతహింసలు చెలరేగగా కాంగ్రెస్ అసహాయ స్థితిలో ఉండిపోయిందన్న వ్యాఖ్యను తొలగించారు. హిందూ, ముస్లిం నేతల మధ్య ఉన్న అభిప్రాయభేదాలను తమకు అనుకూలంగా మార్చుకున్న బ్రిటిష్ పాలకులు దేశాన్ని విభజించాలని నిర్ణయించారని, మహాత్మగాంధీ సహా కాంగ్రెస్ నేతలు కూడా విభజనను వ్యతిరేకించారని, కానీ చివరకు ముందుకెళ్లేందుకు అదొక్కటే మార్గమని అంగీకరించారన్న విషయాలను కూడా కొత్త పుస్తకంలో చేర్చలేదు. కొత్త పుస్తకంలో సంపూర్ణ స్వరాజ్యం డిమాండ్‌కు మరిన్ని వివరాలు జోడిస్తూ... 1925లో వీర్ సావర్కర్ కూడా స్వరాజ్ కోసం డిమాండ్ చేసినట్టుగా రాశారు. ఫిబ్రవరిలో ప్రచురితమైన పుస్తకంలో స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ సాయుధ దళాన్ని అభివృద్ధి చేసేందుకు హిట్లర్ సాయం కోరినట్టు ఉంది. అలాగే హిట్లర్ నాజీ భావజాలం, విస్తరణవాదం ఫలితంగానే రెండో ప్రపంచయుద్ధం జరిగిందన్న వివరమూ కొత్త పుస్తకంలో లేకుండా చేశారు. సుభాష్ చంద్రబోస్ బ్రిటిష్ వ్యతిరేక శక్తుల సాయం కోరాడని మాత్రమే ఉంచారు. న్యాయవ్యవస్థకు సంబంధించిన 'ద రోల్ ఆఫ్ జ్యుడిషరీ ఇన్ సొసైటీ'లో వివాదాస్పద అంశాలను తొలగించిన ఎన్‌సీఈఆర్‌టీ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, ట్రైబ్యునల్స్, ప్రత్యామ్నాయ విభేద పరిష్కార పద్ధతుల సమాచారం జోడించింది. సమాజంలో వివక్షకు కులం, మతం, జాతి, లింగం, వైకల్యం, లైంగికతవి కారణమవుతున్నాయని ఫిబ్రవరిలో ప్రచురితమైన పుస్తకంలో ఉండగా కొత్తదాంట్లో "ఆర్థిక నేపథ్యం"అనే అంశాన్ని చేర్చారు. 'సిటిజన్‌షిప్: రైట్స్ అండ్ డ్యూటీస్'అన్న అధ్యాయంలో వివక్ష అనేది అనైతికమైంది మాత్రమే కాకుండా చట్టపరంగానూ నిషేధించిందని స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాల నుంచి వచ్చిన వారు కూడా వివక్ష ఎదుర్కొనే అవకాశం ఉందని చెప్పారు. ఇటీవల యూజీసీ 2026 సమానత నియమావళి పై జరిగిన చర్చలో ఆర్థిక వెనుకబడిన స్థితి స్పష్టంగా రక్షిత వర్గంగా పేర్కొనలేదన్న విమర్శల మధ్య ఈ మార్పునకు ప్రాధాన్యమేర్పడింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రస్తావన పాఠ్యపుస్తకంలో, ఈ పుస్తకం సుప్రీం కోర్టు రిట్ పిటిషన్ (సివిల్) నెం: 1/2026 ద్వారా ఇచ్చిన ఆదేశాల మేరకు మళ్లీ ప్రచురించామని ఎన్‌సీఈఆర్‌టీ స్పష్టం చేసింది. కొత్త పుస్తకం తయారీలో పాల్గొన్న రచయితల సంఖ్య 51 నుంచి 48కి తగ్గింది.

# మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్



పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన 'కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్'కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. 'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు. ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.

## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా దేశ సాంస్కృతిక వారసత్వపు ఛాయలే



భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి దాదాపు 1,000 సంవత్సరాల పురాతన చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించారు. త్రిమూర్తులైన శివుడు, విష్ణువు, బ్రహ్మలు కొలువైన ఈ గుడిలో మోదీ పూజలు చేశారు. అనంతరం ఇరు దేశాధినేతలు కలిసి ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రంబనన్ హిందూ దేవాలయాల సముదాయానికి సంబంధించిన అద్భుతమైన వైమానిక దృశ్యాలను (ఏరియల్ వ్యూ) 'ఎక్స్'లో షేర్ చేశారు మోదీ. ఈ యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడానికి 'అద్భుతమైన ప్రంబనన్ ఆలయం!' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ప్రధాని మోదీ ప్రంబనన్ ఆలయ సందర్శన ఈ విశాలమైన గుడి ప్రాంగణంలో భారత్ సాయంతో చేపట్టే పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి మార్గం సుగమం చేసింది. ఇది యాక్ట్ ఈస్ట్ పాలసీ కింద భారత సాంస్కృతిక దౌత్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇదే ప్రాజెక్ట్‌పై ప్రధాని మోదీ, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రభోవోల మంగళవారం విస్తృత ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ పరిరక్షణ ప్రాజెక్ట్ కోసం ఇద్దరు నాయకులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) పరస్పరం మార్చుకున్నారు. యోగ్యకార్తాలోని ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా అక్కడ భారతదేశ సాంస్కృతిక వారసత్వపు ఛాయలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆగ్నేయాసియాలో భారత వారసత్వానికి ప్రంబనన్ ఆలయం రెండో అతిపెద్ద గుర్తింపని తెలిపారు. ఈ ఆలయంలో శివుడు, దుర్గాదేవి, గణేషుడి విగ్రహాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ గుడిలో శతాబ్దాలుగా పూజలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈరోజు తాను కూడా ప్రంబనన్ ఆలయాన్ని దర్శించుకున్నానని చెప్పారు. అక్కడ పూజలు చేసే అవకాశం తనకు లభించిందన్నారు. గుడి పునరుద్ధరణ పనులు పూర్తైన తర్వాత తాను మళ్లీ ఈ గుడి వస్తానని వాగ్దానం చేశారు.

"నేను ఇండోనేసియా వచ్చి ఇది మూడో రోజు. అయినా ఇక్కడి సంభాషణల్లో, గాలిలో సాంస్కృతిక పరిమళం అలముకుంది. భారతదేశంలో మనం ప్రతి క్షణం అనుభవించే పరిమళం ఇది. ఈ సాంస్కృతిక వారసత్వ పరిమళం ఇరుదేశాల ప్రజలను ఒకరికొకర్ని అనుసంధానిస్తుంది. ఈ వారసత్వాన్ని పరిరక్షించిన ఇండోనేసియా ప్రజలకు, నాయకులకు ధన్యవాదాలు. ప్రంబనన్ గుడిలో పరమశివునితో అనుసంధానమయ్యే అవకాశం నాకు లభించడం నా అదృష్టం. హట్కేశ్వర్ మహాదేవ్ ఆలయం ఉన్న వాద్‌నగర్‌లో నేను జన్మించాను. సోమనాథ్ జ్యోతిర్లింగం ప్రపంచంలోనే మొదటి జ్యోతిర్లింగం. అది గుజరాత్‌లో ఉంది. నేను ఎంపీగా గెలుపొందిన నియోజకవర్గం వారణాసిలో కాశీ విశ్వనాథుడి ఆలయం ఉంది. ఆయన ఆశీస్సులు నాకు నిరంతరం లభిస్తున్నాయి. ప్రంబనన్ ఆలయ పునురుద్ధరణ పనులను ప్రారంభించే అవకాశం నాకు లభించింది. దీనిని నేను గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను." అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

గుడి చరిత్ర ఏంటంటే?

జావా ద్వీపంలో ఉన్న ప్రంబనన్ ఆలయాన్ని 9వ శతాబ్దంలో నిర్మించారు. ఇది ఇండోనేసియాలో అతిపెద్ద హిందూ గుడి. కంబోడియాలో ఉన్న అంగ్‌కోర్‌వాట్ తర్వాత ఆగ్నేయాసియాలో ఇదే పెద్ద దేవాలయం. దాదాపు 40 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ గుడి ప్రాంగణంలో మొదట సుమారు 240 ఆలయాలు ఉండేవి. ఈ గుడి నిర్మాణాన్ని హిందూ మాతారామ్ రాజవంశానికి చెందిన రాజు రాకై పికాతన్ ప్రారంభించగా, ఆయన వారసుడు లోకపాల పూర్తి చేశారు. ఇక్కడి శివ, విష్ణు, బ్రహ్మ ఆలయాలలో 47 మీటర్ల ఎత్తున్న ప్రధాన శివాలయం అత్యంత ప్రముఖమైనది. ఈ ఆలయ గోడలపై చెక్కిన రామాయణ గాథ శిల్పాలు భారత్-ఇండోనేసియాల ప్రాచీన నాగరికత బంధానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. ఈ గుడిని యూనెస్కో 1991లో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.

**పర్యటనలో కీలక ఘట్టాలతో వీడియో**

మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ తన ఇండోనేసియా పర్యటనలో ముఖ్యాంశాలను ప్రదరిస్తూ ఓ వీడియోను పంచుకున్నారు. ఇండోనేసియాలో తనకు లభించిన ఘన స్వాగతం, ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ప్రవాస భారతీయులతో తాను జరిపిన సమావేశాలలోని కీలక ఘట్టాలను ఆ వీడియోలో పొందుపర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ఇండోనేసియా పిల్లలు భారత్, ఇండోనేసియా జెండాలను ఊపుతూ 'స్వాగతం మోదీజీ', 'ఐ లవ్ యూ మోదీజీ' అంటూ నినాదాలు చేస్తూ ప్రధానికి స్వాగతం పలకడంతో ఈ వీడియో ప్రారంభమైంది. జకార్తాలోని అధ్యక్ష భవనంలో ఘన స్వాగత కార్యక్రమం, గౌరవ వందనం, సైనిక కవాతు, ఇరు దేశాధినేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశాలు కూడా ఈ వీడియోలో ఉన్నాయి. అలాగే ఈ సమావేశాలు సందర్భంగా మోదీ చేసిన వ్యాఖ్యలను కూడా ఈ వీడియోలో ఉన్నాయి. కాగా, ఇండోనేషియా పర్యటన ముంగించుకున్న మోదీ, ఆస్ట్రేలియాకు బయలుదేరారు.

## సంపాదకీయం

# ఆరేళ్లలో 67 లక్షల సైబర్ నేరాలు

ప్రపంచం మొత్తం మీద డిజిటల్ డేటాలో భారతదేశం ఇప్పుడు 20 శాతానికి చేరుకుంది. డిజిటల్ చెల్లింపులు, స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరగడంతో సైబర్ నేరాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు కృత్రిమ మేధస్సు (ఎఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీ ఉపయోగించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో ప్రజలను మోసగిస్తున్నారు. కొన్ని కోట్లు కొల్లగొడుతున్నారు. 2019– 2025 వరకు 67.32 లక్షల సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండింట మూడొంతులు అంటే 43.22 లక్షల కేసులు గత రెండేళ్ల లోనే నమోదు కావడం గమనార్హం. గత ఆరేళ్లలో సైబర్ మోసాల ద్వారా సుమారు రూ. 55,000 కోట్లు బాధితులు నష్టపోయారు. అంటే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు సైబర్ మోసాల ఖాతాకే చేరాయి. అంతేకాదు అశ్లీల పదజాలం కూడా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లద్వారా వ్యాప్తి చెందుతోంది.రేప్ వీడియో, చైల్డ్ వీడియో ద్వారా పిల్లలకు సంబంధించిన అసభ్యకరమైన పదజాలంతో పెయిడ్ యాడ్స్ కనిపించాయని వాటిని క్లిక్ చేసిన వినియోగదారులు టెలిగ్రామ్ ఛానెళ్లకు మళ్లించి ఆ వీడియోలను విక్రయిస్తున్నారని ఓ మీడియా సంస్థ బయటపెట్టగా ప్రభుత్వం స్పందించి ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత మెటా సంస్థను గట్టిగా హెచ్చరించింది. ఇలాంటి సంఘటనలు చాలా పెద్ద సమస్యలో ఓ చిన్నభాగం మాత్రమే. రోజురోజుకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అంతకన్న వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ చట్టాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటివరకు డీప్‌ఫేక్స్, ఇతర సమస్యలను నివారించడానికి ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)చట్టంపై ఆధారపడుతూ వచ్చింది అయితే ఎఐ వ్యవస్థలు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, సాంకేతికతను సురక్షితంగా మార్చడానికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ పర్యావరణ వ్యవస్థ మనకు ఏర్పాటైంది. ఇందులో ఆధార్, యుపిఐ, ఒఎన్‌డిసి వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. ఆధార్ వల్ల ప్రజల గుర్తింపు స్థిరీకరణ జరగడమే కాక, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు నేరుగా చేరడానికి ఉపయోగపడుతుంది. యుపిఐ అన్నది తక్షణ చెల్లింపుల వ్యవస్థ. స్మార్ట్‌ఫోన్ ద్వారా చిల్లర వ్యాపారం నుండి పెద్దపెద్ద లావాదేవీల వరకు సెకన్లలో డబ్బులు పంపడానికి, స్వీకరించడానికి తోడ్పడుతోంది. ఒఎన్‌డిసి వాణిజ్య రంగాన్ని వికేంద్రీకరించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఓపెన్ నెట్‌వర్క్. దీని ద్వారా చిన్న వ్యాపారులు, స్థానిక విక్రేతలు, కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించవచ్చు. ఈ ప్లాట్‌ఫారాలన్నీ సామాన్యుల దైనందిన జీవితాన్ని ఎంతో సులభతరం చేశాయి. ఇవి పాలనా వ్యవహారాలను, ఆర్థిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి.ఈ సౌకర్యాలు ఎలా ఉన్నా డిజిటల్ దాడులు విస్తరించే ప్రమాదాలు కూడా పెరిగాయి. కృత్రిమ మేధస్సు సహాయంతో జరిగే సైబర్ దాడులను గుర్తించడం, వాటిని నివారించడం చాలా కష్టంగా మారుతోంది. ఈ దాడులు బ్యాంకింగ్, టెలికమ్యూనికేషన్స్, రక్షణ (డిఫెన్స్), విద్యుత్, ఆరోగ్య భద్రతరంగాలకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారంగానే సైబర్ నేరగాళ్లు అత్యంత నమ్మదగిన ఫిషింగ్ ఈ మెయిల్స్, డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ గుర్తింపులు, అధునాతన మాల్వేర్‌ను సృష్టిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ కనిపెట్టలేని విధంగా నిరంతరం తమ కోడ్‌ను మార్చుకునే మాల్‌వేర్‌ను సృష్టిస్తున్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎఐ టూల్స్ సహాయంతో హ్యాకర్లు సాఫ్ట్‌వేర్‌లో లోపాలను అందరికన్నా ముందుగానే పసిగట్టి దాడులకు పాల్పడుతున్నారు. వీటిని నివారించడం సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పెద్ద సవాలుగా మారింది. సైబర్ ముప్పులను నివారించడానికి ప్రభుత్వం అనేక ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. ఇండియా ఎఐ మిషన్‌తోపాటు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి ఇన్) వ్యవస్థను బలోపేతం చేసింది. జీరో ట్రస్ట్ అనే పద్ధతిని స్వీకరించింది.సాధారణ భద్రత విధానాల్లో ఒకసారి నెట్‌వర్క్ లోకి ప్రవేశించిన ఎవరినైనా లేదా ఏదైనా పరికరాన్ని నమ్ముతారు. కానీ జీరో ట్రస్ట్ విధానంలో, నెట్‌వర్క్ లోపల ఉన్నా లేదా బయట ఉన్నా ఎవరినీ గుడ్డిగా నమ్మరు. ఆ వినియోగదారుడి పనికి అవసరమైన డేటా, ఫైల్స్ లేదా అప్లికేషన్‌కు మాత్రమే అనుసంధానం కలుగుతుంది. దీనివల్ల డేటా రక్షణ కలుగుతుంది. సైబర్ దాడుల నుండి డేటాను కాపాడుకోడానికి ప్రభుత్వ ఏజెన్సీలు సిఇఆర్‌టి ఇన్ వంటి సంస్థలు భద్రతా లోపాలను గంటల వ్యవధి లోనే పరిష్కరించాలన్న నిబంధనలు తీసుకు వస్తున్నారు. భారత్ ఏ దేశంపై ఆధారపడకుండా ఇప్పుడు స్వంతంగా కృత్రిమ మేధస్సు సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. రూ.10,300 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించింది. లక్షలాది మందికి ఉపయోగపడేలా జిపియు కంప్యూటింగ్ (గ్రాఫింగ్ ప్రాసెసింగ్ యూనిట్), స్టార్టప్ ఫండింగ్ వ్యవస్థలను అందుబాటు లోకి తెస్తోంది. ఏదేమైనా ఈ ప్రయత్నాలన్నీ విచ్ఛిన్నంగానే ఉంటున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 1,01,118 సైబర్ నేరాలు నమోదయ్యాయి. కాగా తెలంగాణలో వాటి సంఖ్య 27,230. అంటే తెలంగాణ వాటానే 27%గా నమోదయింది. రాష్ట్రంలో రోజుకు సగటున 75 సైబర్ నేరాల కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో కర్ణాటకలో 21,993 కేసులు నమోదై రెండోస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల బారిన పడుతున్న బాధితుల్లో తెలంగాణ వాసులు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది. జనాభా ఆధారంగా రాష్ట్రంలో క్రైమ్‌రేట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 71.1గా నమోదు అయింది. రెండోస్థానంలో ఉన్న కర్ణాటకలో అది 32.2. దేశవ్యాప్త సగటు 7.4 మాత్రమే ఉంది. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత విషయంలో పోలీస్‌శాఖ వాదన మరోలా వినిపిస్తోంది. తమకు అందుతున్న ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తుండటంతోనే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా కేసుల నమోదులో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు అభియోగపత్రాల నమోదు రేటులో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సగటు కేవలం 16.2 కాగా దేశవ్యాప్త సగటు ఏకంగా 31.6గా నమోదయింది.వీటికి సంబంధించిన ఏజెన్సీలు వేటికి అవే స్వతంత్రంగా పనిచేస్తున్నాయి తప్ప సమన్వయం కనిపించడం లేదు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (14 సి)ను బలోపేతం చేయడం ద్వారా కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య సమన్వయం పెరిగి సైబర్ బెదిరింపుల ముప్పును ఎదుర్కోగలుగుతారు. భారత దేశం తన ఎఐ వ్యూహంలో కేవలం సాంకేతికతను అభివృద్ధి చేయడమే కాక, దానిని సైబర్ దాడుల నుండి రక్షించుకునే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవడం తప్పనిసరి

# మళ్లీ వరదకష్టాల్లో ముంబై



ఎప్పటి మాదిరే ముంబై మహానగరం భారీ వర్షాలతో తడిసి ముద్దయింది. గత ఆరు రోజుల కుంభవృష్టితో 13 మంది మరణించారు. జనావాసాలు వరద నీట మునగడం, చెట్లు కూలడం, రోడ్ల ఆచూకీ తెలియకుండా పోవటం, ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి వాహనదారులు దిక్కుతోచని స్థితికి చేరటం, రైళ్లన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోవటం, విద్యాసంస్థలన్నీ మూతపడటం, పరీక్షలు వాయిదాలు పడటం... ఇవన్నీ దాదాపు ప్రతియేటా ముంబై ప్రజలకు రివాజుగా మారాయి. ఒక పిటిషన్ విచారణ సందర్భంగా మంగళవారం బృహన్ముంబై కార్పొరేషన్(బీఎంసీ)ని అనవసరంగా నిందించవద్దని బొంబాయి హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. భూదురాక్రమణలకు పాల్పడటం, పేవ్‌మెంట్లు ఆక్రమించటం, చెత్తను ఎక్కడికక్కడ మురికి కాల్వల్లోకి తోసేయటం వంటి ధోరణులే సమస్యల్ని సృష్టిస్తున్నాయని తెలిపింది. అది నిజమే కావొచ్చుగానీ... అలాంటి ధోరణులను అరికట్టే బాధ్యత కూడా బీఎంసీదే. ఆ విషయంలో అది విఫలం కావటంవల్లనే ప్రతియేటా సమస్యలు తప్పడంలేదు.

వానాకాలం వచ్చిందంటే ముంబైలో పెనుగాలులు, కుంభవృష్టి ఏకకాలంలో విరుచుకుపడుతుంటాయి. భౌగోళికంగా ముంబై ఉన్న స్థానం అటువంటిది గనుక ఇది అనివార్యమైన పరిస్థితి. అయితే దాన్ని దృష్టిలో పెట్టుకుని చేయాల్సిందేమిటన్న అంశంపై సమగ్ర దృష్టి సారిస్తే పరిష్కారం లభించకపోదు. ప్రభుత్వాలు ఆ పని చేయవు. బీఎంసీ ఒత్తిడి తీసుకురాదు. ముంబై ఒకప్పుడు ఏడు దీవుల సమాహారం. వాటిమధ్య 1784 నుంచి 1845 వరకూ మట్టి నింపుతూ పోవటం వల్ల ఇప్పుడున్న భౌగోళిక రూపం వచ్చింది. సముద్ర మట్టానికి ఈ నగరం కేవలం 14 మీటర్ల ఎత్తులో ఉంటుంది. కొన్నిచోట్ల ఒకటి, రెండు మీటర్లకు మించి లేదు. ముంబై వరదనీట కోసం నాలుగు నదులున్నాయి. నాలాలున్నాయి. వీటి ద్వారా నీరంతా సముద్రంలో కలుస్తుంది. కానీ వర్షాల తీవ్రత వుండి, సముద్రపు పోటు అధికంగా ఉంటే ఇవి అక్కరకు రావు. భూ మాఫియాల పుణ్యమా అని తీరాన ఉన్న మడ అడవులు, చిత్తడి నేలలు మాయమై రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతుంటే నిలువరించే వ్యవస్థలు లేవు. బ్రిటిష్ కాలంనాటి డ్రెయినేజీ వ్యవస్థ, కాంక్రీట్ నిర్మాణాలు, మరోపక్క వలసలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

నీటితో కలిసి జీవించటం అలవాటు చేసుకుంటే, అందుకనుగుణమైన జీవన విధానం అలవరుచుకుంటే ఇంత చేటు సమస్య ఉండదు. టోక్యో నగరం ఇందుకు ఉదాహరణ. అక్కడ ప్రతియేటా తుపాన్లు తప్పవు. పర్యవసానంగా వరదనీరు ముంచె త్తుతుంది. దీన్ని అధిగమించటం కోసం 2006లో ప్రపంచంలోనే అతి పెద్ద భూగర్భ వరద నీటి మళ్లింపు వ్యవస్థను నిర్మించింది. నగరం కింద 50 మీటర్ల లోతులో 6.3 కిలోమీటర్ల పొడవునా భారీ టన్నెళ్లు ఏర్పరిచారు. భారీ వరద నీరు ముంచెత్తినప్పుడు అదంతా ఆ టన్నెళ్లకూ, అక్కడినుంచి అయిదు అతి పెద్ద బావుల్లోకీ... వాటినుంచి భారీ భూగర్భ ట్యాంకుల్లోకీ పోతుంది. అక్కడినుంచి శక్తిమంతమైన జెట్ ఇంజన్ పైపులతో ఆ నీటిని తోడి నగరం ఆవలి భాగంలోని ఎడొగావా నదిలోకి పంపుతారు. చైనాలోనూ స్పాంజ్ సిటీల పేరుతో నీటిని ఎప్పటికప్పుడు భూమిలోకి పంపే రంధ్రాలున్న రోడ్లు నిర్మించారు. నగరాల చుట్టూ కృత్రిమంగా చిత్తడి నేలలు ఏర్పరిచారు. ఇవన్నీ వర్షపు నీటిని పీల్చుకుని భూగర్భ జలాలుగా మారుస్తాయి. సాధారణ రోజుల్లో పిల్లలకు ఆట స్థలాలుగా, భారీ వర్షాల సమయంలో తాత్కాలిక చెరువులుగా మారే వాటర్ స్క్వేర్‌లు నిర్మించి రోటర్‌డ్యామ్ నగరాన్ని నెదర్లాండ్స్ ప్రభుత్వం కాపాడుకుంది.

ముంబై నగరాన్ని ప్రకృతి దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టడం కాక, అందుబాటులోని సాంకేతికతల సాయంతో తగిన ప్రణాళికలు రచించుకుంటే అక్కడి ప్రజలకు ప్రతియేటా ఈ తిప్పలు తప్పుతాయి. మాఫియాలను నియంత్రించటం, మౌలిక సదుపాయాలు... ముఖ్యంగా రవాణాను మెరుగుపరచటం వంటివి చేస్తే నగరం కిక్కిరిసిపోయే పరిస్థితిని నివారించవచ్చు. బ్రిడ్జిల నిర్మాణం, రోడ్ల వెడల్పు పేరుతో భారీ ప్రాజెక్టులు చేపట్టి అవి ఏళ్లతరబడి కొనసాగించటంవల్ల జనజీవనం స్తంభించిపోతోంది. వర్షాకాలం ఇదంతా అనేక రెట్లు పెరుగుతోంది. ఇప్పటికైనా మహారాష్ట్ర ప్రభుత్వం మేల్కొనాలి.

# నీళ్లు ఎత్తిపోస్తరా.. డెల్టాకు వదిలేస్తరా?



తెలంగాణలో సూపర్ ఎల్ నినో కరువును తీవ్రతరం చేసింది. అదే సమయంలో రాజకీయ వేడిని కూడా పెంచింది. ఈనెల 5న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు కాంగ్రెస్.. సర్కార్ కల్పించిన అనేక అడ్డంకులను అధిగమించి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించారు. గోదావరి నదిలో ప్రవహిస్తున్న లక్ష క్యూసెక్కుల నీటిని చూపించి, ఈ నీటిని ఎత్తిపోసి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాకపోతే తమకు అప్పజెప్తే వారం రోజుల్లో నీటిని ఎత్తిపోసి, రిజర్వాయర్లను నింపి చూపిస్తామని సవాల్ విసిరారు. ఇందుకు సర్కార్ ఒప్పుకోని పక్షంలో వేలాదిమంది రైతులతో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి తామే పంపులను ఆన్ చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ బృందం కన్నెపల్లి పంప్ హౌస్ ను సందర్శించడం, ఆ తర్వాత రైతు హెచ్చరికలతో రాష్ట్రంలో మరింత రాజకీయ వేడిని రాజేసింది. బీఆర్ఎస్ సవాల్‌కు కౌంటర్‌గా 6వ తేదీన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ నెపాన్ని ఎన్‌డీఎస్‌ఏ మీదకు నెట్టి, బరాజ్‌ల మరమ్మతులు పూర్తయ్యేదాకా వాటిల్లో నీటిని నింపే ప్రసక్తే లేదని ప్రకటించారు. 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహచర మంత్రివర్గ సభ్యులతో కలిసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో అసలు వర్షాలే లేవు, వరదలే లేవు, నీటిని ఎట్లా ఎత్తిపోయాలని సాక్షాత్తు సీఎం ప్రశ్నించారు. ఇది అవగాహనారాహిత్యంతోనా లేదా సమాచారలోపం వలన అన్న మాటనా తెలియదు. గతంలో కూడా సీఎం ఇటువంటి తప్పుడు మాటలు మాట్లాడి సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌కు గురైన సందర్భాలు ఉన్నాయి. సీఎం మాటలు ఎంత సత్యదూరమో ప్రతిరోజూ కేంద్ర జల సంఘం నమోదు చేస్తున్న గేజ్ రీడింగ్స్ చూస్తే తెలుస్తుంది్రాశీశ్రీఙఅఎం

నిజానికి ఈనెల 5న కేటీఆర్ పర్యటనలోనే కనిపించిన వాస్తవం అది. మేడిగడ్డ బరాజ్ వద్ద పెద్దఎత్తున ప్రవాహాలు ఈనెల 1వ తేదీ నుంచే నమోదవుతున్నాయి. 8వ తేదీ ఉదయం 9 గంటలకు మేడిగడ్డ వద్ద 1,02,300 క్యూసెక్కులు, సమ్మక్క బరాజ్ వద్ద 1,30,000 క్యూసెక్కులు నమోదైంది. అంటే మేడిగడ్డ నుంచి రోజుకు 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకోవడానికి అనుకూలంగా గోదావరిలో ప్రవాహాలు ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం ఎన్‌డీఎస్‌ఏ విధించిన ఆంక్షలను సాకుగా చూపించి ఈ ప్రవాహాలను ఎత్తిపోయలేమని మొండిగా వాదిస్తున్నది. మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా నీటిని నింపకూడదని ఎన్‌డీఎస్‌ఏ ఆంక్షలు పెట్టిన మాట వాస్తవమే. మూడు బరాజ్‌లు ఒకేరకంగా డిజైన్, నిర్మాణ పద్ధతులు అవలంబించినందున మేడిగడ్డలోని కుంగుబాటు అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా సంభవించే అవకాశాలు ఉంటాయి. కనుక పరీక్షలు జరిపి, అనుమానం నివృత్తి చేసుకున్న తర్వాత లేదా ఏమైనా లోపాలు ఉన్నాయని పరీక్షల్లో నిర్ధారణ అయితే వాటి మరమ్మతులు పూర్తయ్యాకే నీటిని నిల్వ చేయాలని ఎన్‌డీఎస్‌ఏ భావించింది. అంతేకానీ అక్కడ లోపాలు ఉన్నాయని నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. అయితే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో మేడిగడ్డలో ఉన్నట్టు కట్టడంలో ఎటువంటి కుంగుబాటుగాని, పగుళ్లుకాని లేవు. వాటిలో ఇంజినీర్లు గమనించింది కేవలం బుంగలు మాత్రమే. ఆ బుంగలను 2021లోనే కెమికల్ గ్రౌటింగ్ చేసి పూడ్చేశారు. ఆ తర్వాత అక్కడ మళ్లీ బుంగలు ఏర్పడలేదు. స్వచ్ఛమైన నీరు బయటకు రావడం కనిపించింది. మట్టి, ఇసుక లేకుండా కేవలం స్వచ్ఛమైన నీరు బయటకు రావడం మామూలు విషయం. అదేమీ ప్రమాద సంకేతం కాదు. అన్ని మట్టికట్టల నుంచి ఇటువంటి ఊటలు వస్తాయి. వాటిని మట్టికట్ట కింద కట్టిన కాలువల ద్వారా వాగులోకి పంపిస్తారు. ఆ నీటిలో మట్టి లేకపోతే ఆ ఊటలు రావడంతో మట్టికట్ట సురక్షితంగా ఉన్నదని భావించవచ్చు. అటువంటి ఊటలు రాకపోతేనే మట్టికట్ట కూలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నది. మట్టికట్టలోనే కాదు.. కాంక్రీట్ డ్యామ్‌లలో గోడల నుంచి కూడా నీటిఊటలు వస్తాయి. నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్ లాంటి డ్యామ్‌ల్లో నిర్మించిన గ్యాలరీల్లో వాటిని చూడవచ్చు. ప్రతీరోజు వాటిని సంప్‌లోకి పంపి, అక్కడ నుంచి పంప్ చేసి నదిలోకి వదులుతారు. పరిమితి మించని నీటి ఊటల వల్ల మట్టికట్టలు, కాంక్రీట్ డ్యామ్‌లకు ఏ ప్రమాదమూ వాటిల్లదు. అది సహజమైనదే. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా బుంగలను పూడ్చివేసిన తర్వాత ఇటువంటి స్వచ్ఛమైన నీటి ఊటలే కనిపించాయి. 2023 అక్టోబర్‌లో కుంగుబాటు తర్వాత మూడు బరాజ్‌లను ఫ్రీ ఫ్లో కండిషన్‌లోనే పెట్టారు. ఆ తర్వాత 2024, 2025 లలో భారీ వరదలు సంభవించినప్పుడు మేడిగడ్డ బరాజ్‌లో అదనపు పగుళ్లు కాని, కుంగుబాటు కాని రాలేదు. బరాజ్‌లో నిర్మాణ లోపాలు, డిజైన్ లోపాలు, నాణ్యతాలోపాలు ఉంటే కుంగుబాటు తర్వాత వచ్చిన భారీ వరదలు మొత్తం బరాజ్‌ను నాశనం చేసి ఉండేవి. కాని అట్లా జరుగలేదు. 2023లో ఏమి జరిగిందో అక్కడే ఆగిపోయింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూడా ఆ వరదలను తట్టుకొని నిలబడ్డాయి. వరదను సురక్షితంగా కిందికి పంపించాయి. గోదావరి నదే మూడు బరాజ్‌లు పటిష్టంగా ఉన్నాయని నిరూపించింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు సురక్షితంగా ఉన్నాయన్న సంగతి ప్రాజెక్టు ఇంజినీర్లకు తెలుసు. వారే 2025లో మేడిగడ్డతో సంబంధం లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ 1ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ఇన్‌టేక్‌కు వంద మీటర్ల దిగువన 96 మీటర్ల ఎత్తుకు ఒక రబ్బర్ డ్యామ్ నిర్మిస్తే నీటిని పంప్‌హౌస్‌లోకి మళ్లించవచ్చు. అక్కడి నుంచి గ్రావిటీ కాలువ ద్వారా అన్నారంనకు, అక్కడ నుంచి సుందిళ్ల, ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోసుకోవచ్చునని ప్రభుత్వానికి నివేదించారు.

ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్ 1ను ఆపరేషన్‌లో పెట్టే ఉద్దేశం లేదు కనుకనే ఆ నివేదికను తొక్కిపెట్టింది. తమ్మిడిహట్టి నుంచి నీటిని ఎల్లంపల్లికి కాకుండా సుందిళ్లకు తరలించాలని ప్లాన్ సిద్ధం చేస్తున్నది. ఆ బరాజ్‌లు సురక్షితం కాకపోతే సుందిళ్లకు తరలించడం దేనికి? అంటే నీటిని ఎత్తిపోయకపోవడానికి ఇప్పుడు ప్రభుత్వం చెప్తున్న కారణాలు సమంజసమైనవి కావని తెలుస్తునే ఉన్నది. 2024, 2025లో భారీ వర్షాలు కురిసినందున శ్రీరామ్‌సాగర్, ఎల్లంపల్లి, కడెం, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, ఇతర జలాశయాల్లో, చెరువుల్లో నిండుగా నీరు లభ్యమైంది. కాబట్టి ప్రభుత్వాన్ని కన్నెపల్లి పంపులను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయాలని ఎవరూ డిమాండ్ చేయలేదు. ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటికే 42 శాతం లోటు వర్షపాతం నమోదైంది. భూగర్భజలాలు అడుగంటిపోయాయి. సాగునీటికే కాదు, తాగునీటికి కూడా కొరత ఏర్పడిన పరిస్థితి నెలకొన్నది. ఇంతటి కరువులో కూడా మేడిగడ్డ వద్ద వరద ఉధృతి ఉన్నది. నీటి లభ్యత ఇక్కడ మాత్రమే ఉన్నది. కరువు సృష్టించిన ప్రకృతి, ఈ కరువును ఎదుర్కోవడానికి ప్రాణహిత జలాలను తెలంగాణకు కానుకగా ఇచ్చింది. కాబట్టి కరువు నేపథ్యంలో రాబోయే దుర్భిక్ష పరిస్థితులను అధిగమించేందుకు కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి, ఎగువన జలాశయాల్లో నిల్వ చేసుకోవడం తప్ప మరో మార్గం లేదు. ఇందుకు మార్గాలను అన్వేషించాలని తెలంగాణ పౌరసమాజం, ఇంజినీర్లు, రైతులు, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బరాజ్‌ల నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, అనుభవజ్ఞులైన విశ్రాంత ఇంజినీర్లతో సమాలోచన చేస్తే పరిష్కార మార్గాలు లభిస్తాయి. అదే సమయంలో ఎన్‌డీఎస్‌ఏకు ఇక్కడి వాస్తవ పరిస్థితులను వివరించి వారి సూచనలను కూడా పొందవచ్చు. ఇప్పుడు కావలసింది రాజకీయ పరిణతి, విజ్ఞత, ప్రజలు, రైతులకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి మాత్రమే. రాజకీయ క్రీడ ఆడటానికి ఇది సమయమూ కాదు, సందర్భమూ కాదు. మరొక ప్రశ్న కూడా ముందుకు వస్తున్నది. కాళేశ్వరం బరాజ్‌లకు ఉన్న ఆంక్షలు సమ్మక్క బరాజ్‌కు లేవు కదా! అక్కడ ఈ రోజు 1,30,000 క్యూసెక్కుల వరద కిందికి పోతున్నది కదా! ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి కదా! మరి దేవాదుల పంపులు ఆన్ చేయడానికి ప్రభుత్వం ఎందుకు పూనుకోవడం లేదు? రాజకీయ భేషజాలకు పోకుండా కన్నెపల్లి పంపులను, దేవాదుల పంపులను తక్షణమే ఆన్ చేసి, సాగు, తాగు అవసరాల కోసం నీటిని ఎత్తిపోయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. ఆ బాధ్యతను నెరవేరుస్తారా? లేదా గోదావరి జలాలను గోదావరి డెల్టా ఆయకట్టు అవసరాలను తీర్చడానికి వదిలేస్తారా?

# ఉగ్రామ్ అద్భుతం... తెలంగాణ స్టార్టప్ రెడీ

హైదరాబాద్ : తెలంగాణకు చెందిన రక్షణ స్టార్టప్ 'ద్వీప డిఫెన్స్' డీఆర్డీవోతో కలిసి అద్భుతం చేసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వదేశీ ఆయుధాల తయారీపై డీఆర్డీవో దృష్టి పెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్రం కూడా రక్షణ బడ్జెట్ పెంచింది. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన స్టార్టప్ 7.6251 ఎంఎం క్యాలిబర్‌లో ఉగ్రం(జఉఖీంఓ) అనే దేశీ రైఫిల్‌ను అభివృద్ధి చేసింది. ఈ ప్రాజెక్టును కేవలం 100 రోజుల్లోనే డిజైన్ చేసి, నమూనా తయారు చేయడం రక్షణ రంగంలో వేగాన్ని పెంచింది. సాధారణంగా ఆయుధాల అభివృద్ధికి సంవత్సరాలు పట్టే పరిస్థితుల్లో ఈ వేగం ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి బలం చేకూర్చుతోంది. ఉగ్రమ్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్వహించిన కఠినమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఈ రైఫిల్‌ను తమ ఆయుధభండారంలో చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. సాధారణంగా విదేశీ ఆయుధాలపై ఆధారపడే సీఏపీఎఫ్‌కు దేశీ రైఫిల్ అందుబాటులోకి రావడంతో ఖర్చు తగ్గడం, సరఫరా భద్రత పెరగడం, నిర్వహణ సౌలభ్యం వంటి ప్రయోజనాలు ఏర్పడతాయి. డీఆర్డీవోకి చెందిన ఆయుధ పరిశోధన, అభివృద్ధి సంస్థతో స్టార్టప్ సంయుక్తంగా పని





చేయడంతో ఈ వేగం సాధ్యమైంది. ప్రైవేట్‌రంగ స్టార్టప్‌లు తమ సౌలభ్యం, ఆవిష్కరణ సామర్థ్యం, త్వరిత నిర్ణయాలతో డీఆర్డీవో సాంకేతిక నైపుణ్యాన్ని మిళితం చేస్తున్నాయి. ఇది రక్షణ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ఎంత ముఖ్యమో చాటుతోంది. 100 రోజుల్లో డిజైన్ నుంచి నమూనా వరకు పూర్తి చేయడం భవిష్యత్తులో అత్యవసర అవసరాలకు త్వరితంగా స్పందించే సామర్థ్యాన్ని నిరూపిస్తోంది.

ఈ విజయం రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. సీఏపీఎఫ్‌కు వంటి పెద్ద సంఖ్యలో ఆయుధాలు అవసరమయ్యే బలగాలకు స్థానికంగా ఉత్పత్తి అయ్యే రైఫిల్‌లు అందుబాటులోకి రావడం వల్ల దేశీయ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో రక్షణ స్టార్టప్‌లు వృద్ధి చెందడం దేశవ్యాప్తంగా రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థను బలపరుస్తోంది. ఉగ్రం విజయం తర్వాత ఇలాంటి స్టార్టప్‌లు మరిన్ని ఆయుధాలు, సామగ్రి అభివృద్ధిలో ముందుకు రావడానికి మార్గం సుగమం అవుతోంది. డీఆర్డీవోతో సహకారం కొనసాగితే, భారత్ రక్షణ రంగంలో ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు సాధించే అవకాశాలు పెరుగుతాయి. ఈ మోడల్ ఇతర రంగాల్లో కూడా ప్రైవేట్ రంగం, ప్రభుత్వ సంస్థల మధ్య సహకారానికి ఆదర్శంగా నిలుస్తుంది.

# కాక్ రోచ్ ఈజ్ బ్యాక్

హైదరాబాద్ : సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీజేపీ ఎక్స్ ఖాతాను బ్లాక్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. నీట్ పునఃపరీక్ష పూర్తయిన నేపథ్యంలో ఖాతాను బ్లాక్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కేసును జస్టిస్ స్వర్ణ కాంత శర్మ విచారించారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ రీ-ఎగ్జామినేషన్ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం తలెత్తకుండా ఉండేందుకే సీజేపీ ఎక్స్ ఖాతాను తాత్కాలికంగా బ్లాక్ చేసినట్లు కోర్టుకు తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు హాజరయ్యే జాతీయ స్థాయి పరీక్ష సమయంలో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే పోస్టులు పరీక్ష నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం భావించిందని వివరించారు. కేంద్రం జారీ చేసిన బ్లాకింగ్ ఉత్తర్వును సవాల్ చేస్తూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫు న్యాయవాదులు, సోషల్ మీడియా ఖాతాను నిలిపివేయడం భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని వాదించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు, ప్రస్తుత పరిస్థితుల్లో ఖాతాను బ్లాక్ చేయడానికి ఎలాంటి కారణం లేదని తేల్చింది. నీట్ పునఃపరీక్ష ఇప్పటికే పూర్తయినందున కేంద్రం వ్యక్తం చేసిన ప్రాథమిక ఆందోళనకు ఇప్పుడు ప్రాధాన్యం లేదని పేర్కొంది.



### కొనసాగుతున్న సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష

మరోవైపు, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కూడా కొనసాగుతోంది. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనకారులు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయన బరువు 7.3 కిలోలు తగ్గినట్లు తాజా వైద్య నివేదికల్లో పేర్కొన్నారు. రక్తపోటు 102/61 ఎంఎంహెచ్‌జీగా, రక్తంలో గ్లూకోజ్ స్థాయి 68 ఎంజీ/డీఎల్‌గా నమోదైనట్లు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని నిర్వాహకులు వెల్లడించారు. దీర్ఘకాల నిరాహార దీక్ష ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నప్పటికీ, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు తాజా తీర్పుతో సీజేపీ ఎక్స్ ఖాతా పునరుద్ధరణకు మార్గం సుగమం కాగా, భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ అధికారాలపై మరోసారి చర్చ ప్రారంభమైంది. కాగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించిన ప్రకారం, జూన్ 21న జరిగిన నీట్ రీ-టెస్ట్‌కు ముందు విద్యార్థుల్లో అనవసర ఆందోళనలు, అపోహలు వ్యాపించే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చర్య తీసుకుంది. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు. దాంతో మే 21న దాని అసలు ఎక్స్ ఖాతాను భారతదేశంలో నిలిపివేశారు. అనంతరం ఈ బృందం 'అనీఇనెతీనీజీఇష్ట్ర ఎబ ఃజీఇనె' పేరుతో మరో కొత్త ఎక్స్ ఖాతాను ప్రారంభించింది. ప్రస్తుతం ఆ ఖాతాకు రెండు లక్షల 27 వేలకుపైగా ఫాలోవర్లు ఉన్నారు.

# గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో ఓవైసీ వ్యూహం..

హైదరాబాద్ : ఎం ఐ ఎం చీఫ్? అసదుద్దీన్ ఓవైసీ చాలా రోజుల తర్వాత హైదరాబాద్ లో చిచ్చు రాజేశాడు. సోషల్ మీడియా వేదికగా సౌత్, వెస్ట్ హైదరాబాద్ నుంచి అనేక ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు మార్చడం అన్యాయమని, ఇది సాధారణ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతోందని వ్యాఖ్యానించారు. గుడిమాల్కాపూర్ మార్కెట్ తరలింపును ఆధారంగా చేసుకుని, నగరంలోని వివిధ జోన్ల మధ్య వివక్ష ఉందనే పెద్ద అంశాన్ని తెరపైకి తెచ్చారు. పాతనగరం సౌత్ పరిధిలోకి, మెహదీపట్నం-కార్వాన్ పరిసరాలు వెస్ట్ పరిధిలోకి వస్తాయి. ఈ నిర్ణయాలు ప్రాంతాల మధ్య అసమానతను పెంచుతున్నాయని, స్థానికుల భావోద్వేగాలను రెచ్చగొట్టాడు. ఇటీవలి సంవత్సరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, శాంతిభద్రతను మెరుగుపరచడం, శివారు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన కార్యాలయాలు, విభాగాలను రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొత్త భవనాలకు, తూర్పు-ఉత్తర శివార్లకు మార్చింది. ఇందులో కలెక్టరేట్ సంబంధిత విభాగాలు, వక్ఫ్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయాలు, పోలీస్ నిర్వహణ కార్యాలయాలు, మార్కెటింగ్ శాఖ నోడల్ కార్యాలయాలు ఉన్నాయి. పాతనగరంలోని ఇరుకైన రోడ్లు, అధిక జనసాంద్రత వల్ల రోజూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. కొత్త ప్రాంతాల్లో విశాలమైన రోడ్లు, మెరుగైన కనెక్టివిటీ, ఆధునిక సౌకర్యాలు ఉండటం వల్ల పరిపాలన సౌలభ్యం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. శివార్ల అభివృద్ధి



ద్వారా నగరం మొత్తం సమతుల్యంగా వృద్ధి చెందాలనేది లక్ష్యంఓవైసీ ఇలా జోన్ల వారీగా అసంతృప్తిని బయటపెడుతున్నారనేది బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయి. పాతనగరం ఎంఐఎంకు ఎప్పటి నుంచో బలమైన ఆధారం. అయితే వెస్ట్ జోన్‌లో ఐటీ కారిడార్ విస్తరణ వల్ల మెహదీపట్నం, కార్వాన్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో జనాభా మార్పులు పార్టీకి కొత్త సవాళ్లను తెస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగులు, కుటుంబాలు నివసించడం వల్ల స్థానిక సంప్రదాయ ఓటర్ల నిష్పత్తి మారుతోంది. ఈ ప్రాంతాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు లేదా వ్యాపార కేంద్రాలు శివార్లకు తరలిపోతే, స్థానిక మైనారిటీల ఆర్థిక వనరులు దెబ్బతినడమే కాక, చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు ప్రభావితమవుతారు. గుడిమాల్కాపూర్ వంటి సాంప్రదాయ మార్కెట్లు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవి. అందుకే ప్రభుత్వం సౌత్, వెస్ట్ హైదరాబాద్‌ను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందనే భావోద్వేగ అంశాన్ని ఉపయోగిస్తున్నారు. సాధారణ పరిపాలనా మార్పులను కూడా ప్రాంతీయ వివక్షగా చిత్రీకరించడం ద్వారా, పాతనగరంలోని కొత్త ఓటర్లను, వెస్ట్ హైదరాబాద్‌లోని వ్యాపార వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకం చేయాలనేది ఓవైసీ ప్రధాన ప్రణాళిక. నగర అభివృద్ధి అంతా హైటెక్ సిటీ లేదా ఉత్తర హైదరాబాద్ వైపు మాత్రమే జరుగుతోందని, సౌత్-వెస్ట్ ప్రాంతాలను పాలకులు వదిలేస్తున్నారని బలంగా ప్రచారం చేసి, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో తమ ఓటు బ్యాంకును రక్షించుకోవడానికి ఈ భౌగోళిక వ్యూహాన్ని అనుసరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విధానం ద్వారా స్థానిక సంఘాల్లో ఐక్యతను పెంపొందించి, ప్రత్యర్థి పార్టీల ప్రభావాన్ని తగ్గించాలనేది ఓవైసీ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ వివాదం మరింత రాజకీయ దుమారానికి దారితీసే అవకాశం ఉంది. స్థానిక సంఘాల నుంచి నిరసనలు, ప్రజా ఉద్యమాలు రావచ్చు. ఇదే సమయంలో ప్రభుత్వం మరోవైపు నగరం మొత్తం అభివృద్ధిని నొక్కి చెప్పి, తరలింపు నిర్ణయాలను సమర్థించవచ్చు. ఓవైసీ ఈ అంశాన్ని ఎక్కువగా ఉపయోగిస్తే, ఎన్నికల సమయంలో ఓటర్ల మధ్య చర్చలు ఎక్కువవుతాయి. ఈ చర్చ నగర అభివృద్ధి, ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ వ్యూహాల మధ్య సంబంధాన్ని స్పష్టం చేస్తోంది.

## ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

నల్గొండ : రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసినా సొంత ఇల్లు, కారు కూడా లేకుండా కేవలం ఒక పాత స్కూటర్‌తో సాధారణ జీవితం గడిపిన అసలు సిసలైన 'ప్రజల మనిషి', కాంగ్రెస్ సీనియర్ నేత కొమ్మిడి నర్సింహారెడ్డికి తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత గౌరవం కల్పించింది. భువనగిరి మాజీ ఎమ్మెల్యే అయిన నర్సింహారెడ్డి నిన్న తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. రాజకీయాల్లో నీతికి, నిజాయతీకి బ్రాండ్ అంబాసిడర్‌లా బతికిన నర్సింహారెడ్డి లాంటి గొప్ప నిరాడంబర నాయకుడికి ఈ రకమైన గౌరవం దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తనకున్న వందలాది ఎకరాల భూమిని పేదలకు రాసిచ్చి 'భూదాన రెడ్డి'గా పేరు తెచ్చుకున్న ఆయన, చివరి రోజుల్లో అద్దె ఇంట్లో ఉంటూ కన్నుమూశారు. ఈ అరుదైన ప్రజా నాయకుడికి తుది వీడ్కోలు ఘనంగా పలికేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీలకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు జారీ చేశారు. నర్సింహారెడ్డి స్వగ్రామమైన బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని పోలీస్ బందోబస్తు, ఇతర ఏర్పాట్లను యంత్రాంగం చకచకా పూర్తి చేస్తోంది.

## వానలు లేకపోయిన గోదావరి

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రతి ఏటా ఈ సమయానికి కురవాల్సిన సాధారణ వర్ష శాతం కంటే తక్కువ శాతం వర్షాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కురిశాయి. ఇదంతా ఒకవైపు. మరోవైపు గోదావరి నది నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. క్రమంగా గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. దీనికి కారుణం... ఎగువన మహారాష్ట్ర, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దంచికొడుతున్న వర్షాలే. భారీ వర్షాలతో గోదావరి ఉపనదులు పొంగిపొర్లుతూ గోదావరిలోకి వచ్చి చేరుతున్నాయి. దీంతో వరద ప్రవాహం భారీగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టుకు ఏకంగా లక్ష క్యూసెక్కుల నీరు ఉరకలెత్తుతోంది. దీంతో, అలర్ట్ అయిన జలవనరుల శాఖ అధికారులు 48 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే, స్పిల్‌వే నుంచి వరద నీరు ఊహించని వేగంతో దూసుకురావడంతో.. స్పిల్ చానల్ మధ్య 902 హిల్ నుంచి మహానందీశ్వరస్వామి టెంపుల్ వరకు ఉన్న మట్టి, రాతి రవాణా కాజ్‌వేకు గండిపడింది. ప్రాజెక్టు పనుల కోసం వాహనాలు తిరిగేలా నిర్మించిన ఈ కాజ్‌వే వరద తాకిడికి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు దిగువన ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద కూడా గోదావరి నీటిమట్టం శరవేగంగా పెరుగుతోంది. ప్రవాహం ఇంతకంటే ఎక్కువైతే, బ్యారేజ్ గేట్ల ఎత్తి నీటిని నేరుగా దిగువకు వదిలేస్తారు. కిందకు వదిలిన నీరంతా సముద్రంలో కలవనుంది.

## పవన్ వీరాభిమాని మృతి



వరంగల్ : అభిమానిని కలవడానికి స్టార్ హీరోగా కాదు.. ఆప్తుడిలా అతడి ఇంటి గుమ్మం దాటారు పవన్ కళ్యాణ్. మంచానికే పరిమితమైన ఆ బాలుడి చేతిని పట్టుకుని ధైర్యం చెప్పారు. "మనిద్దరం కలిసి ాఉ సినిమా చూద్దాం.. ాఉ 2 వస్తే నువ్వే నా స్పెషల్ గెస్ట్" అని ప్రేమగా మాటిచ్చారు. కానీ ఆ కల నిజమయ్యేలోపే.. ఆ అభిమాని ఈ లోకాన్ని విడిచిపెట్టాడు. హనుమకొండ హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల పొనుగంటి నిరంజన్ గత కొంతకాలంగా అరుదైన న్యూరోమస్క్యులర్ జన్యు వ్యాధితో పోరాడుతున్నాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరిన అతడి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించింది. వైద్యుల ప్రయత్నాలు ఫలించక బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. ఈ వార్తతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు. నిరంజన్‌కు పవన్ కళ్యాణ్ అంటే ప్రాణం. పవన్ పాటలు, డైలాగ్‌లతో చేసిన అతడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ విషయం పవన్ దృష్టికి చేరింది. వెంటనే జూన్ 17న స్వయంగా అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొద్దిసేపు అతడి పక్కనే కూర్చుని మాట్లాడారు. ప్రేమగా హత్తుకుని ధైర్యం చెప్పారు. "అందరూ నన్ను 'చోటా గబ్బర్ సింగ్' అని పిలుస్తారు" అని నిరంజన్ చెప్పినప్పుడు పవన్ కూడా చిరునవ్వుతో ఆనందం వ్యక్తం చేశారు. వెళ్లే ముందు బహుమతులు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తూ త్వరలో మళ్లీ కలుద్దామని చెప్పారు. తనకు కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా.. ఆరోజే కుక్క పిల్లను అందించారు. అయితే ఆ ఆప్యాయ భేటీ జ్ఞాపకంగా మిగిలిపోగా.. కొన్ని రోజులకే నిరంజన్ మృతి చెందడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. ఒక అభిమాని చివరి కోరికను నెరవేర్చాలని కోరుకున్న హీరో.. ఇప్పుడు అదే అభిమానిని కోల్పోవాల్సి రావడం అభిమానులను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తోంది.

## బెంగలూరు తరహాలో కోకాపేట నిర్మాణాలు

హైదరాబాద్ : పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ, కమర్షియల్ హబ్ శరవేగంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెన్సీ నివేదికలు వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం.. కోకాపేట నియో-పోలిస్ ఫేజ్-2 లేఅవుట్లలో వాణిజ్య స్థలాల ధరలు చదరపు గజానికి ఎన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డు స్థాయి మార్కును తాకాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు లభిస్తున్న అనుమతులే ఇక్కడి భూములకు రెక్కలు రావడానికి ప్రధాన కారణం. ఒకప్పుడు బెంగళూరులోని ఎంజీ రోడ్ లేదా చెన్నైలోని ఓఎమ్ఆర్ ప్రాంతాలు దక్షిణాదిలోనే అత్యంత ఖరీదైన కమర్షియల్ స్థలాలుగా ఉండేవి. అయితే, గడిచిన కొద్దికాలంగా కోకాపేట పరిసర ప్రాంతాల్లో జరిగిన ప్రభుత్వ భూముల వేలం పాటలు , తాజా ప్రైవేట్ మార్కెట్ విశ్లేషణల ప్రకారం.. వాటన్నింటినీ వెనక్కి నెట్టి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఖరీదైన , అత్యున్నత స్థాయి వాణిజ్య హబ్‌గా కోకాపేట నియో-పోలిస్ అవతరించింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు ఇక్కడ తమ కార్యాలయాలను స్థాపించేందుకు పోటీ పడుతుండటంతో ల్యాండ్ వాల్యూస్ భారీగా పెరిగాయి. నియో-పోలిస్ లేఅవుట్ ప్రత్యేకత ఏమిటంటే.. ఇక్కడ ఎలాంటి ఎత్తు పరిమితులు లేకుండా వందలాది అంతస్తులతో స్కై స్క్రాపర్ భవనాలను నిర్మించుకునే వెసులుబాటు ఉంది. దీనికి తోడు 100 నుండి 150 అడుగుల వెడల్పు గల ట్రంక్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , పవర్‌లైన్ నెట్‌వర్క్, ఔటర్ రింగ్ రోడ్డుకు నేరుగా ఉన్న కనెక్టివిటీ వంటి మల్టీ-బిలియన్ డాలర్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇక్కడి భూములకు తిరుగులేని డిమాండ్‌ను తెచ్చిపెట్టాయి. ఈ వారం నమోదైన రికార్డు ధరలు పశ్చిమ హైదరాబాద్ శివార్ల రియల్ ఎస్టేట్ సామర్థ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్ కు చాటిచెప్పాయి. ఈ స్థాయి రేట్లు కేవలం కమర్షియల్ ల్యాండ్స్ కే పరిమితం కాకుండా.. పరిసరాల్లోని నార్సింగి, గండిపేట, పుప్పాలగూడ వంటి మైక్రో-మార్కెట్లలోని రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు, లగ్జరీ విల్లాల ధరలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు ఇన్వెస్టర్లకు ఇది భారీ లాభాలను తెచ్చిపెడుతున్నా.. సాధారణ, మధ్యతరగతి కొనుగోలుదారులకు పశ్చిమ హైదరాబాద్ ప్రాపర్టీలు మరింత భారంగా మారనున్నాయి

# కొడంగల్ టూ శంషాబాద్ లైన్ క్లియర్


**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మక రేడియల్ రోడ్-2 నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పది రోజుల్లో భూములు సేకరించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. రైతులతో జరిపిన చర్చలు సఫలమవడంతో ఆర్‌ఆర్ యాక్ట్-2013 ప్రకారం పారదర్శక పరిహారానికి రైతులు అంగీకార పత్రాలు ఇచ్చారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 81 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారి వల్ల శంషాబాద్, షాద్‌నగర్ ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్లు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతికి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అత్యంత కీలకమైన రేడియల్ రోడ్-2 నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్లలో భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముట్‌పూర్, చుక్కమెట్, లాలాపేట్, ఉమ్మెత్యాల్, తుమ్మపల్లి గ్రామాల్లో ఈ రహదారి కోసం అవసరమైన భూములను రాబోయే పది రోజుల్లోనే పూర్తిస్థాయిలో సేకరించడానికి కసరత్తు ప్రారంభించారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకున్నారు. రైతుల తరపున ప్రతినిధులతో ఉన్నత స్థాయి సంప్రదింపులు, ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ భూసేకరణ చట్టం ఆర్‌ఆర్ యాక్ట్-2013 నిబంధనల ప్రకారం పారదర్శకమైన పద్ధతిలో మార్కెట్ ధరకు అనుగుణంగా తగిన పరిహారాన్ని అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సానుకూల చర్చల అనంతరం భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతుల నుంచి అధికారులు అధికారిక అంగీకార పత్రాలను సేకరించారు. రేడియల్ రోడ్-2 ప్రాజెక్టును రాజధాని శివార్లలోని బుద్వేల్ నుంచి ప్రారంభించి షాబాద్, కొందూర్, పరిగి మీదుగా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్



వరకూ మొత్తం 81 కిలోమీటర్ల మేర అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే శంషాబాద్, షాబాద్ మండలాలలో ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్లకు, కొత్తగా రాబోతున్న ఐటీ పరిశ్రమలకు అంతర్జాతీయ స్థాయి రవాణా సౌకర్యం లభించనుంది. ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కార్గో టెర్మినల్ నుంచి నేరుగా షాబాద్, కొడంగల్ ప్రాంతాలల్లోని భారీ పరిశ్రమలకు అవసరమైన భారీ యంత్రాలు, ముడిపదార్థాలు, విదేశీ పరికరాలను వేగంగా, సులభంగా తరలించడానికి ఈ మార్గం అనుకూలంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. రేడియల్ రోడ్-2 నిర్మాణం పూర్తికావడం ద్వారా శంషాబాద్-షాద్‌నగర్ ప్రాంతాల మధ్య సరికొత్త పారిశ్రామిక జోన్లు ఏర్పడేందుకు అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు కీలక ప్రాంతాల మధ్య కేవలం హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా మాత్రమే పరిమిత సంఖ్యలో పరిశ్రమలు నడుస్తున్నాయి. అయితే.. ఈ నూతన ఆర్‌ఆర్-2 రహదారి ద్వారా అంతర్గత ప్రాంతాలైన షాబాద్, షాద్‌నగర్ డివిజన్‌లోని కొందూరు, చౌదరిగూడ వంటి గ్రామీణ మండలాల్లోకి కూడా పారిశ్రామికీకరణ విస్తరిస్తుంది. దీనివల్ల మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన కనెక్టివిటీ లభించడమే కాకుండా, స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించి ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోనుంది.

# హైదరాబాద్‌కు క్యూ కడుతున్న ఇంటర్నేషనల్ వర్శిటీలు..

**హైదరాబాద్ :** తెలంగాణ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 15 విదేశీ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ యూజీసీకి దరఖాస్తు చేసుకోగా.. మరికొన్ని వర్సిటీలు సంప్రదింపులు జరుపుతు న్నాయి. ఈ విదేశీ క్యాంపస్‌ల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడంతో పాటు, మేధో వలసలు తగ్గి స్థానికంగానే ఉద్యోగ, పరిశోధన అవకాశాలు లభించనున్నాయి. ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ రంగాల్లో అంతర్జాతీయంగా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం త్వరలోనే అంతర్జాతీయ ఉన్నత విద్యా రంగానికి కూడా గ్లోబల్ హబ్‌గా మారబోతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం 2020తో పాటు, యూజీసీ ప్రకటించిన నూతన సడలింపులు భారత్‌లో విదేశీ వర్సిటీల ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేశాయి. ఈ అనుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుంటూ వివిధ దేశాలకు చెందిన సుమారు 15 ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాల యాలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి క్యూ కడుతున్నాయి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఉన్న అత్యుత్తమ మౌలిక సదుపా యాలు, శాంతిభద్రతలు, నివాసయోగ్యమైన వాతావరణం అంతర్జాతీయ సంస్థలను ఇటువైపు ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రక్రియలో భాగంగా అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ క్యాంపస్‌ల ఏర్పాటు కోసం యూజీసీకి అధికారికంగా దరఖాస్తులు కూడా చేసుకున్నాయి. ప్రస్తుతానికి ఈ విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేట్ భాగస్వామ్యంతోనే స్వతంత్ర ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ఒక ప్రముఖ వర్సిటీ వచ్చే విద్యాసంవత్సరం నుంచే క్లాసులు ప్రారంభించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఐటీ కారిడార్ గచ్చిబౌలిలోని ఒక భారీ కమర్షియల్ టవర్‌లో కొన్ని అంతస్తులను లీజుకు తీసుకునేందుకు ప్రభుత్వ వర్గాలతో చర్చలు జరుపుతోంది. తాత్కాలికంగా ఇక్కడ ప్రారంభించి భవిష్యత్తులో ప్రయోగశాలలు, స్పోర్ట్స్ అకాడమిలతో కూడిన శాశ్వత క్యాంపస్‌ల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం




యోచిస్తోంది. మరికొన్ని టాప్ వర్సిటీలు కూడా క్యాంపస్‌ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికాకు చెందిన పర్డ్యూ యూనివర్సిటీ, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధులు ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారులతో ప్రాథమిక సంప్రదింపులు పూర్తి చేశారు. అదేవిధంగా.. యూకేకు చెందిన బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాకు చెందిన వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ఇక్కడ ప్రత్యేకంగా క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. వీటితో పాటు న్యూ కాజిల్ యూనివర్సిటీ, చిచెస్టర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హెర్ట్‌ఫోర్డ్‌షైర్, న్యూజిలాండ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ వైకాటో ప్రతినిధులు కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి తమ ప్రతిపాదనలను సమర్పించారు. తెలంగాణ నుంచి ప్రతి సంవత్సరం ఉన్నత చదువుల కోసం వేల సంఖ్యలో విద్యార్థులు కోట్లాది రూపాయల ధనాన్ని వెచ్చించి అమెరికా, యూకే, కెనడా వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. అంతర్జాతీయ స్థాయి విద్య ఇక్కడే అందుబాటులోకి రావడం వల్ల అక్కడకు వెళ్లే అవసరం ఉండదు. ఈ క్యాంపస్‌ల నిర్మాణాల ద్వారా రాష్ట్రంలోకి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రానున్నాయి. అంతేకాకుండా, బోధన, బోధనేతర రంగాల్లో, ఐటీ సపోర్ట్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలలో స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పరిశ్రమలకు సమీపంలో ఈ క్యాంపస్‌లు ఉండటం వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ కార్పొరేట్ ప్రాజెక్టులు సులభంగా దక్కుతాయి. పరిశోధనల విషయానికొస్తే, విదేశీ వర్సిటీలు కేటాయించే భారీ రీసెర్చ్ ఫండ్స్ స్థానిక పీహెచ్‌డీ విద్యార్థులకు వరంగా మారనున్నాయి. హైదరాబాద్‌లోని ఐఐటీ, బిట్స్ పిలానీ, సెంట్రల్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి ఈ గ్లోబల్ వర్సిటీలు సంయుక్త పరిశోధనలు చేపట్టే అవకాశం ఉంది.

# సెంటిమెంట్‌తో కమలం వ్యూహం...

**హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై పట్టు సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణ పర్యటన తర్వాత కొంత నేతల్లో సమన్వయం కనిపిస్తుంది. అలాగే సెంటిమెంట్ ను రగిలించాలని బీజేపీ నేతలు ఈ ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు అర్థమవుతుంది. తాజాగా బీజేపీ రాష్ట్ర నేతలు ఎంఐఎం, హైడ్రా ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. బీజేపీ చేస్తున్న విమర్శలకు ఎంఐఎం ప్రతి విమర్శలు చేస్తూ కమలం పార్టీ ట్రాప్ లో పడినట్లు కనిపిస్తుంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే పతంగి పార్టీ విమర్శలతో బీజేపీ ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.. హైడ్రాను ముందర పెట్టి బీజేపీ విమర్శలకు గత కొద్ది రోజలుగా దిగుతోంది. హైడ్రా కేవలం సామాన్యులు, పేదలు జోలికి మాత్రమే పోతుందని, ఎంఐఎం నేతల ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని ఆరోపిస్తుంది. బీజేపీ చీఫ్ రామ్ చందర్ రావు తో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కూడా హైడ్రాపై వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, ఎంఐఎంకు చెందిన ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. ఫాతిమా కళాశాలను ఆక్రమించి నిర్మించారని, దానిని కూల్చివేయడంలో హైడ్రా అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారని ప్రశ్నించారు. కేవలం పేదల ఇళ్లను కూల్చివేయడానికే హైడ్రాను ఏర్పాటు చేసినట్లుందని అభిప్రాయపడ్డారు. హైడ్రా కొందరి నిర్మాణాలనే కూల్చివేస్తుందని, హైకోర్టు ఎన్ని తీర్పులు చెప్పినా హైడ్రా మాత్రం తన వైఖరిలో మాత్రం మార్పు తీ రావడం లేదని బీజేపీ నేతలు అంటున్నారు.. దీనికి ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. తమను భయపెట్టాలని కొందరు చూస్తున్నారని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. బెదిరింపులకు లొంగేది లేదని అన్నారు. ఎంఐఎంకు చెందిన విద్యాసంస్థలను కూల్చివేస్తామని కొందరు బెదిరిస్తున్నారని, కానీ ఇలాంటి బెదిరింపులకు తాము భయపడేది లేదని తెలిపారు. ఫాతిమా కళాశాలపై ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పందించారు. తమ విద్యాసంస్థను ఎలా కాపాడు కోవాలో తమకు తెలుసునని అన్నారు. ఒక విద్యాసంస్థను కూల్చివేస్తే వంద విద్యాసంస్థలు నిర్మిస్తామని అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పారు. తమను బెదిరించి లొంగదీసుకోవాలని భావించడం అవివేకమని అన్నారు. దీంతో గ్రేటర్ ఎన్నికల వేళ సెంటిమెంట్ రగిలి హైదరాబాద్ మున్సిపల్ నగర పరిధిలో ఎక్కువ ఓటు బ్యాంకును సొంతం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి బీజేపీ ఈ వ్యూహంతో ఎన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందన్నది చూడాల్సి ఉంది.

## భారీగా పెరగనున్న ఆస్తి పన్ను

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర మున్సిపల్ పరిపాలనా వ్యవస్థలో గత ఏడు దశాబ్దాలలోనే ఎన్నడూ లేనంతటి అతిపెద్ద సంస్కరణకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1955 నాటి పాత జీహెచ్‌ఎంసీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తూ.. మారుతున్న కాలం, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా సరికొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా ది డ్రాఫ్ట్ కోర్ అర్బన్ రీజియన్ బిల్, 2026 ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. క్యూర్ బిల్లుగా పిలుస్తున్న ఈ మార్పును హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పౌర సేవలను మరింత వేగవంతం చేయడానికి, పరిపాలనను ఆధునీకరించడానికి ఈ చారిత్రాత్మక బిల్లును రూపకల్పన చేసినట్లుగా చెబుతున్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోకి వచ్చే జీహెచ్‌ఎంసీ , సైబరాబాద్ , మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఒకే సమగ్ర పరిపాలనా చట్టం కిందికి తీసుకురావడం. ప్రస్తుతం నగరంలో అర్బన్ ప్లానింగ్, రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రవాణా, ప్రజారోగ్యం, విపత్తు నిర్వహణ వంటి సేవలను వేర్వేరు విభాగాలు చూస్తుండటంతో సమన్వయ లోపం ఏర్పడుతోంది. ఈ కొత్త చట్టం ద్వారా ఈ విభాగాలన్నింటినీ అనుసంధానించనున్నారు. తద్వారా ప్రాజెక్టుల అమలు వేగవంతం కావడమే కాకుండా పౌరులకు నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న యాన్యువల్ రెంటల్ వాల్యూ ఆధారిత ఆస్తి పన్ను విధానానికి ఈ బిల్లు స్వస్తి పలకనుంది. దీని స్థానంలో మార్కెట్ రేట్లకు అనుగుణంగా ఉండే క్యాపిటల్ వాల్యూ ఆధారిత సరికొత్త ఆస్తి పన్ను అసెస్‌మెంట్ నమూనాను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఒక స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. వీటితో పాటు జీఐఎస్ ఆధారిత అర్బన్ ప్లానింగ్, భూగర్భ యూటిలిటీల సమగ్ర నిర్వహణ, ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పౌర సేవలు, సులభతర వాణిజ్యం లో భాగంగా సింగిల్ ట్రేడ్ లైసెన్స్ విధానం, సరళీకృత భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ వంటి కీలక సంస్కరణలను ఇందులో పొందుపరిచారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే భవనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సకాలంలో పన్నులు చెల్లించే వారికి రిబేటులు కూడా ఇవ్వనున్నారు. ఈ డ్రాఫ్ట్ అజఖీఇ బిల్-2026 ను ప్రజల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. హైదరాబాద్ నివాసితులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, నిపుణులు, పారిశ్రామిక రంగానికి చెందిన ప్రముఖులు ఈ ముసాయిదాను పరిశీలించి, తమ విలువైన సలహాలు, సూచనలను జూలై 24, 2026 లోగా సమర్పించాలని జీహెచ్‌ఎంసీ కోరింది. అధికారిక జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ ఫీడ్‌బ్యాక్‌ను పంపవచ్చని, వచ్చిన సూచనలను నిశితంగా పరిశీలించిన తర్వాతే బిల్లుకు తుది రూపునిచ్చి అసెంబ్లీలో ప్రవేశపెడతామని ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ బిల్లు నగర పాలనలో కొత్త మార్పు తీసుకు రానుంది.

## అలక పాన్పు ఎక్కిన కొండా

**వరంగల్ :** తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న రాజకీయ వైరం ఇప్పుడు అధికారికంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. లంగాణ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తన శాఖలో ఎమ్మెల్యేల జోక్యాన్ని కొండా సురేఖ ఆమె ప్రస్తావించారు. తాను పర్యవేక్షిస్తున్న దేవాదాయ శాఖ లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షలు చేయడం ఏంటని లేఖలో ప్రశ్నించారు. మంత్రిత్వ శాఖలో ఎమ్మెల్యేల జోక్యం ఏమిటని కొండా సురేఖ నిలదీశారు. దీనిపై క్రమశిక్షణ కమిటీ చేత విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కడియం శ్రీహరి సమీక్షలు చేస్తూ... ఇతరులు సమీక్షలు చేయడం వల్ల మంత్రిత్వ శాఖలో గోప్యత ఉండదని, దాని వల్ల మంత్రులకే కాకుండా ప్రభుత్వానికి కూడా ఇబ్బందిగా మారతాయని కొండా సురేఖ రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఆదిలోనే తుంచి వేయకపోతే ప్రతి ఒక్కరూ ప్రతి మంత్రిత్వ శాఖలోజోక్యం చేసుకునే ప్రమాదం ఉందని కూడా కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనను పూర్తిగా విస్మరించి, తన శాఖా పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూలై 7, 2026 నాటి అధికారిక లేఖ ద్వారా ఆమె సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేస్తూ.. కడియం శ్రీహరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. ఈ వివాదానికి అసలు కారణం.. జూలై 6వ తేదీన హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిర్వహించిన ప్రత్యేక సమావేశమే. మంత్రి సురేఖకు గానీ, ఆమె కార్యాలయానికి గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. కడియం శ్రీహరి నేరుగా దేవాదాయ శాఖ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని పలు దేవాలయాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. అంతేకాకుండా, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు, ఒక నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలంటూ అధికారులకు ఎమ్మెల్యే స్థాయిలోనే ఆదేశాలు జారీ చేయడంపై కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్లు, అధికారుల కమిటీల ఏర్పాటు వంటివి పూర్తిగా శాఖా మంత్రి స్థాయిలో నిర్ణయించాల్సిన అంశాలు. ఒక ఎమ్మెల్యే ఇలా సమీక్ష చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయం. ఇది కేవలం పరిపాలనా లోపం కాదు, నా రాజ్యాంగబద్ధ అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే ప్రయత్నం అని కొండా సురేఖ లేఖలో సీఎంకు కుండబద్దలు కొట్టారు.

నా దేవాదాయ శాఖలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం సరికాదు

నాకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో కడియం శ్రీహరి సమీక్ష జరిపాడు

ప్రభుత్వ పరిపాలన వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన అంశం కాబట్టి?

ఈ లేఖ ద్వారా వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఉన్న పాత గ్రూపు రాజకీయాలు మరోసారి బట్టబయలయ్యాయి. గతంలో కూడా తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి నాపై దుష్ప్రచారం చేయించారని, ఆ కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయని సురేఖ నేరుగా సీఎంకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరికి పార్టీలో విపరీతమైన ప్రాధాన్యత ఇస్తూ.. కనీసం సీనియర్ మంత్రి అయిన తన శాఖలోనే జోక్యం చేసుకునేలా ప్రోత్సహించడంపై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. దేవాదాయ శాఖ మంత్రికి సమాచారం లేకుండా ఎమ్మెల్యే ఎలా సమీక్ష నిర్వహిస్తారనే దానిపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన ప్రెస్ నోట్, ఫోటోలు, దినపత్రిక క్లిప్పింగులను కూడా సీఎంకు జతపరిచారు. ఒకవైపు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. సీనియర్ లీడర్లు అయిన కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య ఈ లేఖాస్త్రాల యుద్ధం ఎటు దారితీస్తుందో, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారో అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

## మంత్రుల కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

**వనపర్తి :** పలు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాల నిమిత్తం వనపర్తి జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర మంత్రిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వాకిటి శ్రీహరి కి జూపల్లి కృష్ణారావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు పార్టీ శ్రేణులకు పెద్దలకు. మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణాధ్యక్షులు, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం, ఃఒం లు, సింగిల్ విండో అధ్యక్షులు ఉపాధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, జిల్లా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అనుబంధ సంఘాల నాయకులు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా సమైక్య సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్దలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు.

## ఎంజీ యూనివర్సిటీలో విద్యార్థినుల ఆందోళన

**నల్గొండ :** నల్గొండ పట్టణంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థినిలు అర్ధరాత్రి అందోళనకు దిగారు. హాస్టల్ బాత్ రూముల్లో నీటి కొరత ఉందంటూ వీసీ నివాసం ముట్టడించారు. రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. వీసీ బయటకు వచ్చే వరకు కదిలేది లేదన్నారు. రెండు గంటలుగా వీసీ నివాసం ఎదుటే విద్యార్థినుల బైఠాయించారు.

## బిజినెస్

### విజింజం పోర్టులో అదానీ వాటా విక్రయంపై కమిటీ



దేశీయ నౌకాయాన రంగంలో వ్యూహాత్మకమైన విజింజం అంతర్జాతీయ పోర్టులో అదానీ గ్రూప్ తన 49 శాతం వాటాను ఉపసంహరించుకోవాలని భావిస్తున్న తరుణంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదిత వాటా విక్రయం వల్ల రాష్ట్ర ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై సమగ్రంగా అధ్యయనం చేసేందుకు కేరళ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

**రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి**

కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి సతీశన్ విలేకరులతో మాట్లాడారు. విజింజం పోర్టు కేరళ ఆర్థిక ప్రగతికి కీలకమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాన్నీ ప్రభుత్వం తీసుకోబోదని ఆయన స్పష్టం చేశారు. మీడియాలో కథనాలు వచ్చేంత వరకు అదానీ గ్రూప్ తలపెట్టిన ఈ వాటా బదిలీ వ్యవహారం తమ ప్రభుత్వ దృష్టికి రాలేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ షిప్పింగ్ దిగ్గజం ఎంఎస్‌సీ గ్రూప్‌తో అదానీ సంస్థ దాదాపు ఏడాది కాలంగా ఈ వ్యవహారంపై చర్చలు జరుపుతోందనే నిజాన్ని ప్రభుత్వం ఆ తర్వాతే గుర్తించిందని ఆయన వెల్లడించారు. 'వాటా బదిలీకి సంబంధించిన ప్రతిపాదనను అదానీ గ్రూప్ సెబీకి సమర్పించిన రోజే.. ముందస్తుగా రాష్ట్రానికి సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తిని తీవ్రంగా వ్యక్తం చేశాం. ఆ తర్వాతే కన్సెషన్ ఒప్పంద నిబంధనల ప్రకారం వాటా బదిలీకి ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరుతూ అదానీ గ్రూప్ అధికారికంగా ప్రభుత్వం వద్దకు వచ్చింది' అని ముఖ్యమంత్రి అన్నారు.

**గుత్తాధిపత్యం అసాధ్యం**

విపక్ష నేత పినరయి విజయన్ చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి పూర్తిగా కొట్టిపారేశారు. విజయన్ అసలు కన్సెషన్ అగ్రిమెంట్ (రాయితీ ఒప్పందం) చదవకుండానే గుడ్డిగా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ డీల్ వల్ల ఎమ్మెస్సీ గ్రూప్ గుత్తాధిపత్యం ఏర్పడుతుందన్న వాదనలో వాస్తవం లేదన్నారు. ఏ ఒక్క సంస్థా దీనిపై పూర్తి ఆధిపత్యం చలాయించలేదని సీఎం స్పష్టం చేశారు.

**కేంద్ర అనుమతులు వస్తేనే డీల్ పూర్తి!**

ప్రస్తుతానికి వాటా బదిలీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, కాబట్టి రాయితీ ఒప్పందాన్ని అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని చెప్పలేమని సీఎం వివరించారు. ఈ లావాదేవీ ముగియాలంటే కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మాత్రమే సరిపోదని.. దీనికి అనేక రకాల భద్రతా, వ్యూహాత్మక కోణాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు.

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు..
# మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు మాయం!

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కుప్పకూలాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక్క ప్రకటనతో సూచీలు అమాంతం పతనమయ్యాయి. ఈ అనూహ్య పరిణామాలతో దాదాపు రూ.8 లక్షల కోట్ల మేర మదుపర్ల సంపద ఆవిరైంది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా దిగజారగా.. నిఫ్టీ 24 వేల మార్క్‌ను కోల్పోయింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఉదయం సూచీలు నష్టాలతోనే ప్రారంభమయ్యాయి. క్రితం ముగింపు (78,180)తో పోలిస్తే దాదాపు 400 పాయింట్ల నష్టంతో 77,816 వద్ద సెన్సెక్స్ నేడు ట్రేడింగ్‌ను ప్రారంభించింది. మధ్యాహ్నం వరకు ఒడుదొడుకులతోనే సాగిన సూచీ.. ఆ తర్వాత కుప్పకూలింది. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసిందంటూ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్ల బ్లడ్‌బాత్‌కు దారితీసింది. కేవలం 30 నిమిషాల్లోనే సెన్సెక్స్ 1000 పాయింట్లు తగ్గింది. ఒక దశలో 1800 పాయింట్లకుపైగా పతనమైన సూచీ.. మార్కెట్ ముగిసే సమయానికి 1677.12 పాయింట్లు క్షీణించి 76,503.60 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 516.65 పాయింట్ల నష్టంతో 23,882.05 వద్ద ముగిసింది. దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకీ, హిందుస్థాన్ యునీలివర్ షేర్లు భారీగా పడిపోయాయి. ఓఎన్జీసీ, హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో స్వల్పంగా లాభపడ్డాయి. జియో ఫైనాన్షియల్ షేరు 12 శాతం మేర కుంగింది. అమెరికా,



ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం మధ్యాహ్నం ట్రంప్ స్పందిస్తూ.. టెహ్రాన్‌తో కాల్పుల విరమణ ముగిసిందని ప్రకటించారు. ఆ దేశంతో చర్చలు జరపడం కూడా వృథా అని పేర్కొన్నారు. దాంతో మళ్లీ యుద్ధభయాలు నెలకొన్నాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఆరు శాతం పెరిగి 78.56 డాలర్లకు చేరింది. రూపాయి విలువ మరింత క్షీణించింది.

# అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తారాస్థాయికి..
# భగ్గుమన్న ముడిచమురు ధరలు

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇక ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో ఇవాళ చమురు ధరలు ఆరు శాతానికిపైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడయ్యింది. ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళ్లు అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి చమురు ధరల పెరుగుదలతో




మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది.

# అక్తర్ రికార్డు బద్దలు కొడుతా'..
# భారత రైజింగ్ స్టార్ శపథం

గుజరాత్ టైటాన్స్ పేసర్ అశోక్ శర్మ పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ ప్రపంచ రికార్డును బద్దలు కొడుతానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 161.3 కిమీవేగంతో అక్తర్ విసిరిన బంతి ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. తాజాగా అక్తర్ రికార్డును తాను బద్దలు కొడుతానంటూ అశోక్ శర్మ శపథం చేయడం గమనార్హం. ఏదోఒక రోజు అక్తర్ రికార్డును బద్దలు కొట్టే సత్తా తనకు ఉందని ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన అశోక్ శర్మ ఒక మ్యాచ్‌లో 154.2 కిలోమీటర్ వేగంతో (గంటకు 95.8 మైళ్ల వేగం) బంతి విసిరి ఐపీఎల్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ డెలివరీతో రికార్డు సృష్టించాడు. అంతకముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025 సీజన్‌లో 22 వికెట్లు తీయడమే గాక ప్రతీ మ్యాచ్‌లో దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో స్థిరంగా బంతులు వేయడం విశేషం. ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశోక్ శర్మ మాట్లాడుతూ.. 'ఏదో ఒకరోజు అక్తర్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాలనే సంకల్పంతోనే ఉన్నా. బౌలింగ్ వేగం విషయంలో మాత్రం ఎన్నటికీ రాజీపడను. నా దృష్టి ఎప్పుడు బౌలింగ్‌ను మెరుగుపరుచుకోవడంపైనే ఉంటుంది. అంతా సవ్యంగా సాగితే, బహుశా ఒకరోజు అక్తర్ నెలకొల్పిన 161 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలుగుతానేమో. ఈ క్రమంలో నన్ను నేను మెరుగుపరచుకునేందుకు మరింత కష్టపడుతాను. అయితే నా బౌలింగ్‌ను మెరుగుపరచుకునే క్రమంలో ఆరోగ్యకరమైన పోటీ ఉండడాన్ని ఇష్టపడుతాను.' అని చెప్పుకొచ్చాడు. ఇక జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఎంపికైన అశోక్ శర్మకు తుది జట్టులో అవకాశం లభిస్తుందా? లేదా? అనేది పక్కనబెడితే ఐపీఎల్ ప్రదర్శనతో పాటు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రదర్శనను పరిగణలోకి తీసుకొని ఎంపిక చేశారు. అయితే ఇండియా-ఏ జట్టు తరఫున అరంగేట్రం చేసినప్పటికీ పెద్దగా రాణించలేదు. ఒక వన్డే మ్యాచ్‌లో 75 పరుగులిచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆరు మ్యాచ్‌లాడిన అశోక్ శర్మ ఆరు వికెట్లు మాత్రమే తీశాడు. అయితే ప్రతీ జట్టుకు పేస్ బౌలర్లు ఆస్తిలాంటి వారు. జమ్మూ కశ్మీర్ సంచలనం ఉమ్రాన్ మాలిక్ ఐపీఎల్ 2022లో




సంచలన ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. 2023లో వన్డేలు, టీ20ల్లో ఆడినప్పటికీ ఎక్కువకాలం జట్టులో కొనసాగలేకపోయాడు. తన వేగం బలమైనప్పటికీ దానిని నిలకడగా కొనసాగించడంలో విఫలమయ్యాడు. దీనికి తోడు తరచూ గాయాల బారిన పడడం కూడా అతడిని జట్టుకు దూరం చేసింది. మరి అశోక్ శర్మ ఏ మేరకు రాణిస్తాడనేది చూడాలి. ఒకవేళ టీమిండియాలో అవకాశం ఇవ్వాలనుకుంటే అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, బుమ్రా వంటి స్టార్ పేస్లరకు పని భారాన్ని తగ్గించే క్రమంలో అశోక్ శర్మ ఉపయోగపడగలడు. బుమ్రా ఒక్కడే టీమిండియా పేస్ బారాన్ని మోస్తున్న తరుణంలో అశోక్ శర్మ లాంటి యువ బౌలర్ల అవసరం టీమిండియాకు ఎంతో ఉంది.

**చెక్కుచెదరని అక్తర్ రికార్డు**

2003 వన్డే ప్రపంచకప్‌లో రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ అత్యంత ఫాస్టెస్ట్ బంతిని విసిరాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో నిక్ నైట్‌కు (గంటకు 161.3 కిలోమీటర్ వేగంతో) బంతిని విసిరాడు. గంటకు 100 మైళ్ల వేగంతో విసిరడంతో అక్తర్ పేరు క్రికెట్ పుస్తకాల్లో నిలిచిపోయింది. ఇప్పటికీ ఆ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. ఆసీస్ స్పీడస్టర్లు బ్రెట్ లీ, షాన్ టైట్‌లు అక్తర్ రికార్డుకు సమీప దూరంలో నిలిచిపోయారు. బ్రెట్ లీ ఒక మ్యాచ్‌లో గంటకు 161.1 కిలోమీటర్ల వేగం నమోదు చేయగా, షాన్ టైట్ రెండుసార్లు (2005, 2010) అక్తర్ రికార్డుకు దగ్గరగా వచ్చాడు. 2005లో గంటకు 160.7 కిలోమీటర్ల వేగంతో విసరగా, 2010లో గంటకు 161.1 కిలోమీటర్ వేగంతో విసిరాడు.

## స్పోర్ట్స్


### కొలంబియా షూటౌట్.. క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్



**వాంకోవర్:** ఫిఫా వరల్డ్‌కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4-3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్‌ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్‌లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4-3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది. ఫిఫా వరల్డ్‌కప్‌లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించలేదు. వరల్డ్‌కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ మ్యాచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు డేవిన్‌సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్‌జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.

## యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్.. టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యాష్, కియారా అద్వానీల మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ, విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా, ఈ తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యాష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 ఆగష్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




## 22 ఏళ్ల తర్వాత నటుడిగా థమన్.. ఆసక్తికరంగా 'హృదయం మురళి' ట్రైలర్




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు మేకర్స్. ఇక ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా మెరవబోతుండటం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## అతడు స్టార్ నటుడు అనుకోలేదు.. మహేష్ బాబు క్రేజ్‌పై కృతి సనన్ కామెంట్స్!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ '1: నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో... అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అబిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.



## రూ.100 కోట్ల బడ్జెట్.. రూ.15 కోట్ల కలెక్షన్లు బాక్సాఫీస్ వద్ద కొట్టుమిట్టాడుతున్న 'నాగబంధం'.. వర్కవుట్ కాని 'సనాతన కార్డ్'!



టాలీవుడ్‌లో సనాతన ధర్మం, పురాతన ఆలయాల రహస్యాల నేపథ్యంలో తెరకెక్కిన తాజా సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా కొట్టుమిట్టాడుతోంది. సుమారు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో, విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ పాన్-ఇండియా చిత్రం జూలై 3న విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఇటీవలి కాలంలో భక్తి, సనాతన ధర్మం బ్యాక్‌డ్రాప్‌తో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న సంగతి తెలిసిందే. మేకర్స్ ఎంత సనాతనం కార్డు వాడిన సినిమాలో మ్యాటర్ లేకపోతే ప్రేక్షకుల ఆ వైపు కూడా చూడాట్లేదు. అయితే తాజాగా ఈ సినిమా కూడా అలాగే 'సనాతన కార్డ్'తో రాగా.. బలహీనమైన కథనం, దర్శకత్వ లోపాలు, ఎక్కువ నిడివి కారణంగా థియేటర్లలో అస్సలు వర్కవుట్ కాలేదు. సినిమాపై భారీ బడ్జెట్ పెట్టినప్పటికీ.. థియేటర్లలో మాత్రం ఈ సినిమా వసూళ్లు అత్యంత ఘోరంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2100 స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం, మొదటి మూడు రోజుల్లో (వీకెండ్) కలిపి ఇండియా నెట్ కలెక్షన్ల పరంగా కేవలం రూ. 9.75 కోట్లు మాత్రమే రాబట్టింది. ఇక గ్రాస్ వసూళ్లు, ఓవర్సీస్ కలెక్షన్లు అన్నీ కలిపినా మొదటి వీకెండ్ ముగిసేసరికి వరల్డ్‌వైడ్ కలెక్షన్లు రూ. 13.70 కోట్ల నుండి రూ. 15 కోట్ల లోపే పరిమితమయ్యాయి. సినిమా రన్‌టైమ్ ఎక్కువ ఉందని దాదాపు 20 నిమిషాలు తగ్గించిన కూడా ఆశించిన స్థాయిలో సినిమా లేకపోవడంతో ప్రేక్షకులు ఈ అడ్వెంచర్ రైడ్‌ను తిరస్కరిస్తున్నారు. జగపతి బాబు, అనసూయ భరద్వాజ్ వంటి భారీ తారాగణం ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద 'నాగబంధం' గట్టెక్కడం కష్టంగానే కనిపిస్తోంది.





## రవితేజ -- శ్రీ విష్ణు మల్టీస్టారర్‌కు క్రేజీ టైటిల్.. సంక్రాంతి బరిలో నవ్వుల జాతర!

టాలీవుడ్‌లో మరో ఇంట్రెస్టింగ్ మల్టీస్టారర్‌కు రంగం సిద్ధమవుతోంది. మాస్ మహారాజా రవితేజతో పాటు తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీ విష్ణు తొలిసారి ఒకే సినిమాలో నటించనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ఈ టైటిల్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా కథ, కామెడీ టోన్‌కు తగ్గట్టుగానే ఈ టైటిల్ ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. వీశీజఱవం ఈ చిత్రానికి హసిత్ గోలి దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే శ్రీ విష్ణుతో 'రాజా రాజా చోర', 'స్వాగ్' వంటి చిత్రాలను తెరకెక్కించిన హసిత్ గోలి.. ఇప్పుడు రవితేజతో కలిసి మరో వినోదభరితమైన కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో శ్రీ విష్ణు-హసిత్ గోలి కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ మూవీ కానుంది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొంద నున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ నిర్మాత దిల్ రాజు, ఆయన సోదరుడు శిరీష్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని సమాచారం. షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించేలా చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. అలాగే సినిమాను 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్లానింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. రవితేజ ఎనర్జీ, కామెడీ టైమింగ్‌కు.. శ్రీ విష్ణు సహజమైన హాస్యం తోడైతే ఈ సినిమా వినోదానికి కొత్త నిర్వచనం ఇవ్వడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనడం విశేషం. అయితే సినిమా టైటిల్, విడుదల తేదీతో పాటు నటీనటుల పూర్తి వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అప్పటి వరకు 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌తో ఈ క్రేజీ మల్టీస్టారర్ వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.


Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967